PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 169 | విజయవాడ, శనివారం 21 జనవరి 2023 | 6+8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 21 January 2023 | Rs

12వ పిఆర్‌సి వేయాలి

- ఎన్‌జిఒ నేత బండి శ్రీనివాసరావు
- ఉద్యమ నేతలపై విమర్శలు తగదు

లోపలి పేజీలో..



గవర్నర్ రవిని రీకాల్ చేయండి

తమిళనాడు రాజ్‌భవన్ వద్ద సిపిఎం పికెటింగ్



గ్రీన్ ఛానల్‌లో తరలింపు (రేణిగుంట)

తిరుపతి శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ హాస్పిటల్‌లో

గుండె మార్పిడి

మహిళ అవయవ దానంతో నిలిచిన 13 ఏళ్ల బాలుడి ప్రాణం



విశాఖలో విమానంలోకి గుండెను తరలిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ, గాజువాక (విశాఖపట్నం)

తిరుపతిలోని శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్ హాస్పిటల్‌లో అరుదైన గుండె మార్పిడి ఆపరేషన్ శుక్రవారం విజయవంతంగా నిర్వహించారు. దాత గుండెను ప్రత్యేక విమానంలో తీసుకొచ్చి అమర్చారు. అవయవాన్ని తరలించేటప్పుడు మార్గమధ్యలో ఎటువంటి అంతరాయమూ కలగకుండా పోలీసులు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేశారు. అన్నమయ్య జిల్లా చిట్వేల్‌కు చెందిన 13 ఏళ్ల బాలుడు చిన్నతనం నుంచే గుండె సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. ఇటీవల అది తీవ్రతరం కావడంతో తిరుపతిలోని పలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందాడు. స్విమ్స్ వైద్యుల సలహా మేరకు శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ ఆస్పత్రిలో చేరాడు. అక్కడి వైద్యులు బాలుడిని పరిశీలించి గుండె మార్పిడి తప్పనిసరని నిర్ధారించారు. దాత కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ జిల్లాకు చెందిన బిహెచ్ఇఎల్ (భెల్) ఉద్యోగి ఆనందరావు తన భార్య జంజూరు సన్యాసమ్మ (48)తో కలిసి సంక్రాంతి పండగకు సొంత ఊరు వెళ్లారు. ఈ నెల 16న విశాఖ తిరిగి వస్తుండగా ఎయిర్ పోర్టు సమీపంలో బైకు పైనుంచి సన్యాసమ్మ జారిపడిపోవడంతో ఆమె బ్రెయిన్ డెడ్ అయింది. చికిత్స కోసం షీలానగర్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలోనే ఆమె అవయవాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించడంతో వైద్యులు ఇందుకు ఏర్పాట్లు చేశారు. షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి నుంచి విశాఖ ఎయిర్‌పోర్ట్‌కు గ్రీన్ ఛానల్ ద్వారా శుక్రవారం అవయవాలు తరలించారు. తిరుపతి శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడికి ఆమె గుండెను అమర్చేందుకు విశాఖ నుంచి రేణిగుంటకు ప్రత్యేక విమానంలో తీసుకొచ్చారు. అక్కడి నుంచి గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి 25 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 22 నిమిషాల్లో చేరుకునేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఉదయం 11.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయాన్ని చేరుకున్న సన్యాసమ్మ గుండెను 11.52 గంటలకు తిరుపతి పద్మావతి చిల్డ్రన్స్ గుండె ఆస్పత్రికి చేర్చారు. అప్పటికే అక్కడ సిద్ధంగా ఉన్న వైద్యులు ఆ గుండెను బాలుడికి అమర్చారు. దీంతో, అవయవదానానికి అంగీకరించిన వారికి, శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులకు, ట్రాఫిక్‌ను నియంత్రించి సహకరించిన పోలీసులకు బాలుని కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సన్యాసమ్మ తాను చనిపోతూ గుండె దానం ద్వారా బాలుడి ప్రాణం నిలిపింది.

జోక్యం చేసుకోలేం

- జిఓనెం.1 విచారణపై సుప్రీం
- 23న హైకోర్టు సిజె ధర్మాసనం విచారించాలని ఆదేశం



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రహదారులపై సభలు, ప్రదర్శనలు నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులపై హైకోర్టులో జరుగుతున్న విచారణ ప్రక్రియలో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను హైకోర్టు తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ పిటిషన్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహాతో కూడిన ధర్మాసనం ముందుకు శుక్రవారం విచారణకు వచ్చింది. దీనిని విచారించిన ధర్మాసనం 'ఈ అంశం హైకోర్టు డివిజన్ బెంచ్ విచారిస్తుండటంతో పాటు, ఇప్పటికే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిస్థితుల్లో విచారణ ప్రక్రియలో జోక్యం చేసుకోలేం.' అని పేర్కొంది. అదే సమయంలో ఈ నెల 23 వ తేది న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని డివిజన్ బెంచ్ జిఓ నెంబర్1పై విచారణ చేపట్టాలని ఆదేశించింది. వాద, ప్రతివాదులిరువురూ డివిజన్ బెంచ్ ముందు అన్ని అంశాలు ప్రస్తావించుకోవచ్చని స్పష్టం చేశారు. అన్ని అంశాలు ఓపెన్‌గా ఉంచుతున్నామని అన్నారు. ఈ కేసులో శీతాకాల సెలవుల్లో ఉన్న వెకేషన్ బెంచ్ విచారణ పరిధిపై అభ్యంతరం లేవనెత్తుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది సిఎస్ వైద్య నాథన్ అన్నారు. అంతా అత్యవసర ప్రాతిపదికన ఉత్తర్వులు జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నోటీసు కూడా ఇవ్వకుండా... ఉదయం ప్రస్తావిస్తే... మధ్యాహ్నం విచారణ చేపట్టి స్టే ఇవ్వడంపై అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. దీనికి ప్రతివాది కె.రామకృష్ణ తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర అడ్వకేట్ జనరల్ వాదనలు విన్న తరువాతే డివిజన్ బెంచ్ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇరువురి వాదనల అనంతరం పిటిషన్‌పై విచారణను సుప్రీం ధర్మాసనం ముగించింది.

ప్రభుత్వానికి చెంపపెట్టు..

జివో 1 అంశంపై ప్రస్తుతం జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు చెప్పడం వైసిపి ప్రభుత్వానికి చెంపపెట్టు అని టిడిపి అధినేత చంద్రబాబు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. హైకోర్టులోనే విచారణను కొనసాగించాలన్న ఆదేశాలను స్వాగతిస్తున్నట్లు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో వారు తెలిపారు. ఇప్పటికైనా జివో 1ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టెన్త్ ఫీజు గడువు ఈ నెల 31



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తత్కాల్ స్కీం కింద ఈ నెల 31వ తేదీ లోపు ఫీజు చెల్లించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి దేవానందరెడ్డి తెలిపారు. తత్కాల్ స్కీంను శుక్రవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. రూ.500 అపరాధ రుసుంతో ఈ నెల 23 నుంచి 26వ తేది వరకు, రూ.1000 అపరాధ రుసుంతో ఈ నెల 31వ తేది వరకు చెల్లించవచ్చునని వివరించారు. పాఠశాలల ప్రధానోపాధ్యా యులు www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ ఫీజులు చెల్లించాలని పేర్కొన్నారు. నామినల్ రోల్స్‌ను ఆన్‌లైన్‌లోనే ఇదే తేదీల్లో పొందుపరచాలని వెల్లడించారు.

అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి ఉన్నతస్థాయి కమిటీ



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ స్వరాజ్యమైదానంలో నిర్మిస్తున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి ఉన్నతస్థాయి అధికారులతో కమిటీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. విజయవాడలో చేపడుతున్న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ నిర్మాణంపై తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ప్రాజెక్టును వీలైనంత త్వరగా పూర్తి చేయాలని వివరించారు నిర్దేశిత సమయంలో పనులు పూర్తవ్వాలని, నాణ్యంగానూ ఉండాలని వివరించారు. దీనిపై అధికారుల నుండి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. విగ్రహం పీఠంతో కలిస్తే మొత్తం 206 అడుగులు ఎత్తు వస్తుందని, పీఠంభాగంలో జిప్లస్‌టు నిర్మాణం ఉంటుందని అధికారులు సిఎంకు వివరించారు. నిర్మాణంలో 352 టన్నుల ఉక్కు, 112 టన్నుల ఇత్తడిని వినియోగిస్తున్నామని, మార్చి నెలాఖరు నాటికి పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికి కొన్ని విభాగాలను తరలించామని పేర్కొన్నారు. అలాగే రెండువేల మంది పట్టేలా కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్ పార్కింగ్, బస్ పార్కింగుకు ప్రత్యేకంగా స్థలం కేటాయించామని చెప్పారు. అలాగే స్మృతివనానికి దారితీసే అన్ని రోడ్లనూ ఆధునీకరించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి, అధికారులు జయలక్ష్మి, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఎపిఐఐసి ఎమ్‌డి సృజన తదితరులు పాల్గొన్నారు.

మరింతగా బలోపేతం

- కిసాన్-మజ్దూర్ మార్చ్‌కు మద్దతు
- విలేకరుల సమావేశంలో హేమలత



ప్రజాశక్తి- శ్యామల్ చక్రవర్తి నగర్ నుంచి ప్రత్యేక ప్రతినిధి

దేశంలో కార్మికోద్యమాన్ని ఉధృతం చేయడంలో భాగంగా సిఐటియును మరింతగా బలోపేతం చేయనున్నట్లు ఆ సంఘ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ కె. హేమలత చెప్పారు. సిఐటియు 17వ మహాసభలో భాగంగా మూడవ రోజైన శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ దిశలో ప్రతినిధులు దృష్టి సారించారని, విస్తృతంగా చర్చిస్తున్నారని తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో దీనికి సంబంధించి కార్యాచరణను రూపొంచినునట్లు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని, దాంతోపాఉ రైతాంగ వ్యతిరేక, ప్రజా వ్యతిరేకత విధానాలను మోడీ సర్కారు అమలు చేస్తోందని చెప్పారు. కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చడం కోసం సాధారణ ప్రజలపై భారా లు మోపుతోంద న్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా రైతులు, వ్యవసాయ కార్మికులను కలుపుకుని విశాల ఐక్య పోరాటాన్ని నిర్మించాలని నిర్ణయించినట్లు చెప్పారు. దీనిలో భాగంగా ఏప్రిల్ 5వ తేదిన ఢిల్లీలో జరగనున్న కిసాన్-మజ్దూర్ మార్చ్‌కు మద్దతు తెలుపుతూ మహాసభ తీర్మానం చేసినట్లు తెలిపారు. దేశంలో బ్యాంకింగ్, విద్యుత్, తపాలా, కోల్ ఇండియా ఇలా అనేక విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు పెద్దఎత్తున ఇటీవలి కాలంలో పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. కార్మికులకు మద్దతుగా ఉంటున్న కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున దాడికి దిగుతోందన్నారు. ఈ దాడిని ఖండిస్తూ, ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి మద్దతు ప్రకటిస్తూ మరో తీర్మానాన్ని ఈ మహాసభలో చేసినట్లు తెలిపారు. అమెరికా, ఫ్రాన్స్, యుకె, ఇటలీ, జర్మనీ ఇలా అన్ని దేశాల్లోనూ కార్మికులపై దాడి పెరుగుతోందని గుర్తు చేశారు. దీనికి వ్యతిరేకంగా ఆయా దేశాల్లో కార్మికులు పెద్ద ఎత్తున పోరాటాల్లోకి వస్తున్నారన్నారు. ఫ్రాన్స్‌లో గురువారం నాడు జరిగిన నిరసనలో నాలుగు లక్షల మంది ఉద్యోగులు పాల్గొన్నారన్నారు. కార్మికులపై దాడిని ఐక్య పోరాటల ద్వారానే తిప్పికొట్టగలమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కర్నాటక రాష్ట్ర కార్యదర్శి ఉమేష్, సిఐటియు జాతీయ నాయకులు ఆర్కో రాజ్ పండిట్ పాల్గొన్నారు.

యుపి సిఎంపై స్విట్జర్లాండ్ అటార్నీ జనరల్‌కు ఫిర్యాదు

న్యూఢిల్లీ : ఉత్తర ప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ ఆ రాష్ట్రంలో మానవ హక్కులను అణచివేశారని పేర్కొంటూ అంతర్జాతీయ క్రిమినల్ మానవ హక్కుల న్యాయవాదుల ప్రత్యేక బృందం స్విట్జర్లాండ్ ఫెడరల్ ప్రాసిక్యూటర్ (అటార్నీ జనరల్)కు ఫిర్యాదు చేసింది. దావోస్‌లో నిర్వహిస్తున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌కు ఆదిత్యనాథ్ హాజరుకానున్న నేపథ్యంలో ఫిర్యాదు చేయడం గమనార్హం. పౌరసత్వ సవరణ (సిఎఎ)కి వ్యతిరేకంగా శాంతియుతంగా ఆందోళన చేపడుతున్న నిరసనకారులపై 2019 డిసెంబర్ నుంచి 2020 జనవరి మధ్య తీవ్రంగా అణచివేతకు పాల్పడ్డారని ప్రత్యేక బృందం (గ్వర్నికా 37 ఛాంబర్) ఫిర్యాదు చేసింది. ఆరు నెలలపాటు సిఎఎ నిరసన కారులను తీవ్రంగా అణచివేసిందని పేర్కొంది. ఈ దాడుల్లో ముస్లిం మతానికి చెందిన 22 మంది మరణించగా, 117 మంది తీవ్ర వేధింపులకు గురయ్యారని, 307 మందిని అకారణంగా నిర్బంధించారని తెలిపింది. ముస్లిముల అణచివేతకు సిఎంసహా రాష్ట్రంలోని సీనియర్ అధికారులు పోలీసులను ఆదేశించారని చెప్పేందుకు సిఎం ప్రసంగాలు, తగిన సాక్ష్యాధారాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొంది.

బిజెపి మోసాన్ని నిలదీద్దాం

- హోదా ఇవ్వకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం
- కేంద్రాన్ని ప్రశ్నించని వైసిపి, టిడిపి
- హిందూపురం సభలో చలసాని శ్రీనివాస్, పి మధు



హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి- హిందూపురం (శ్రీ సత్యసాయి జిల్లా)

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు... పదేళ్లు ఉండాలని పార్లమెంట్ సాక్షిగా చెప్పి అధికారంలోకి వచ్చాక దానిని అమలు చేయకుండా మోసం చేసిన బిజెపిని రాష్ట్రంలోని అన్ని పార్టీలూ నిలదీయాలని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, సిపిఎం నాయకులు పి.మధు పిలుపునిచ్చారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన బస్సు యాత్రకు అనుమతి ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా హోదా ఇచ్చేంత వరకూ పోరాటం కొనసాగుతుందని తేల్చి చెప్పారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ 'ప్రత్యేక హోదా-ఆంధ్రుల హక్కు' నినాదంతో విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలోని అంబేద్కర్ సర్కిల్‌లో శుక్రవారం బహిరంగసభ జరిగింది. అంబేద్కర్ సర్కిల్ నుంచి గురునాథ్ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. 'ప్రత్యేక హోదా ఆంధ్రుల హ్యక్కు, విభజన చట్టాన్ని అమలు చేయాలి' అని నినాదాలు చేశారు. బహిరంగ సభలో చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా-విభజన హామీలకు విద్యార్థి, యువజన సంఘాల అధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రకు అనుమతి ఇవ్వకుండా రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం చేపట్టిన ఈ యాత్రకు ప్రభుత్వం మద్దతు ఇవ్వాల్సిందిపోయి అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. నాడు టిడిపి ప్రత్యేక హోదా కోసం తలపెట్టిన ధర్మపోరాట దీక్షలో స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తొడగొట్టి మరీ శపథం చేశారని, ప్రస్తుతం జరుగుతున్న ఉద్యమంలో అదే స్ఫూర్తితో ఆయన పాలుపంచుకోవాలని శ్రీనివాస్ కోరారు. బిజెపి కబంధ హస్తాల నుంచి పవన్ కల్యాణ్ బయటపడి హోదా కోసం మిగతా 2లో

గూగుల్‌లో 12 వేల మంది ఇంటికి



శాన్‌ఫ్రాన్సిస్కో : టెక్నలాజీ కంపెనీల్లోని ఉద్యోగాలు తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయి. తాజాగా గూగుల్ మాతృసంస్థ అల్పాబెట్ వేలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపించాలని నిర్ణయించింది. ప్రపంచ వ్యాప్తంగా ఏకంగా 12,000 మంది సిబ్బందికి ఉద్వాసన పలుకుతున్నట్లు గూగుల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) సుందర్ పిచాయ్ వెల్లడించారు. ఇదే విషయమై ఉద్యోగాలు కోల్పోయిన అమెరికన్ ఉద్యోగులకు ఇ-మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చారు. మిగితా ప్రాంతాల వారికి త్వరలోనే సమాచారం ఇవ్వనున్నారు. ఆర్థిక మాంద్యం భయాలు వెంటాడుతుండటంతో ఇప్పటికే ట్విట్టర్, మెటా, అమెజాన్ లాంటి దిగ్గజ కంపెనీలు వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగించిన విషయం తెలిసిందే. ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు ప్రతిభను, మూలధనాన్ని అధిక ప్రాధాన్యతల వైపు మళ్లించడంపై దృష్టి సారించాల్సిన సమమయం ఆసన్నమైందని పిచాయ్ పేర్కొన్నారు. రిక్రూటింగ్, కార్పొరేట్ కార్యకలాపాలు, ఇంజినీరింగ్, ప్రొడక్ట్స్ టీమ్‌కు చెందిన విభాగాలతో పాటు ఇతర విభాగాల్లోనూ తొలగింపులు ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ కోతలు ఉన్నప్పటికీ.. అమెరికాలో సిబ్బందిపై వెంటనే అమల్లోకి వస్తుందని గూగుల్ తెలిపింది. కాగా.. తదుపరి ఉపాధి చూసుకునే వారికి సాయం అందిస్తామని తెలిపింది. కొలువులు కోల్పోయిన ఉద్యోగులకు తగిన పరిహార ప్యాకేజీ చెల్లిస్తామని పిచాయ్ తెలిపారు. 16 వారాల వేతనంతో పాటు గూగుల్‌లో పనిచేసిన ప్రతి ఏడాదికి రెండు వారాల వేతనంతో పాటు పలు ప్రయోజనాలను ప్యాకేజ్‌లో వర్తింప చేస్తామన్నారు. ఉద్యోగం కోల్పోయిన వారికి 2022కు సంబంధించి బోనస్‌తో పాటు వెకేషన్ టైమ్, ఆరు నెలల పాటు హెల్త్ కేర్, జాబ్ ప్లేస్‌మెంట్ సర్వీసులు, ఇమ్మిగ్రేషన్ మద్దతును సపోర్ట్‌ను అందించనున్నట్లు తెలిపారు.

అమెరికా వెలుపల పనిచేసే గూగుల్ ఉద్యోగులు సైతం వారి కాంట్రాక్టులకు అనుగుణంగా బోనస్‌లు, వైద్య బెనిఫిట్స్ పొందుతారన్నారు. కంపెనీ అత్యధిక ప్రాధాన్యతలకు అనుగుణంగా ప్రస్తుత ఉద్యోగులు ఉన్నారా..? లేదా..? అని తేల్చేందుకు పలు ఉత్పత్తి విభాగాల్లో కఠిన సమీక్ష జరిపామని ఉద్యోగులకు రాసిన లేఖలో పిచాయ్ పేర్కొన్నారు. తొలగించిన ఉద్యోగుల్లో కంపెనీలో ఆరు శాతం సిబ్బందికి సమానం. కాగా ఏయే విభాగాల్లో అత్యధికంగా ఉద్యోగులను తొలగించారనే వివరాలను ఆ కంపెనీ ప్రకటించలేదు. 25 ఏళ్ల గూగుల్ ప్రస్తుతం సంక్లిష్ట ఆర్థిక వలయాల మీదుగా సాగుతుందని పిచాయ్ తెలిపారు. ఈ క్రమంలోనే వ్యయాల తగ్గింపునపై దృష్టి పెట్టాల్సి వచ్చిందన్నారు.

స్విగ్గీలో 380 మంది తొలగింపు

బెంగళూరు : గూగుల్ బాటలోనే ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ 380 ఉద్యోగులను తొలగించింది. ఉద్వాసనకు గురైన ఉద్యోగులకు శుక్రవారం ఆ కంపెనీ సిఇఒ శ్రీహర్ష మెజెటీ ఇ-మెయిల్‌లో సమాచారం ఇచ్చారు. సంస్థ పునర్నిర్మాణ చర్యల్లో భాగంగా అత్యంత కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని పేర్కొన్నారు. సవాళ్లతో కూడిన స్థూల ఆర్థిక పరిస్థితులే ఈ నిర్ణయానికి దోహదం చేశాయన్నారు. ఫుడ్ డెలివరీ విభాగంలో వృద్ధి రేటు మందగించిందన్నారు. లాభాలు సన్నగిల్లి రాబడి తగ్గిపోయిందని పేర్కొన్నారు. తొలగించిన ఉద్యోగులకు మద్దతుగా నిలుస్తామని.. మూడు నుంచి ఆరు నెలల్లోగా వారికి నగదు సాయం అందిస్తామని కంపెనీ పేర్కొంది. కంపెనీలో పనిచేసిన కాలం, గ్రేడ్ ఆధారంగా ఈ సాయం ఉంటుందని తెలిపింది.

గిరిజనుల విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ

- గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్



ముఖాముఖిలో సర్పంచ్ పల్లవి

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

గిరిజనుల విద్య, వైద్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ పేర్కొన్నారు. నంద్యాల జిల్లా పాణ్యం మండలం నెరవాడ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో గిరిజనులతో శుక్రవారం నిర్వహించిన ముఖాముఖిలో ఆయన పాల్గొన్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి ఓర్వకల్లు విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో చేరుకున్న గవర్నర్ అక్కడి నుండి రోడ్డు మార్గంలో నెరవాడ గిరిజన పాఠశాలకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. గిరిజనులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఆర్ఒఎఫ్ఆర్ చట్టం ప్రకారం అటవీ భూములను గిరిజనులకే ఇవ్వాలని, గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. వైద్యం కోసం గిరిజనులు డోలి కట్టుకుని ఎంతో దూరం వెళ్లిన సందర్భాలున్నాయని, గిరిజన గ్రామాలకు రోడ్లు వేయడాన్ని అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలన్నారు. గిరిజన పిల్లలను పాఠశాలకు పంపాలని, అప్పుడే దేశానికి సేవ చేయగలరని అన్నారు. గిరిజన సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత తనపై ఉందని తెలిపారు. డిప్యూటీ సిఎంలు పి.రాజన్నదొర, అంజాద్ బాషా మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి ఆర్‌పి సిసోడియా, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కాంతిలాల్ దండే, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ జాహ్నవి, ఎస్‌టి కమిషన్ సభ్యులు శంకర్ నాయక్, మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, జడ్‌పి చైర్మన్ వై.పాపిరెడ్డి, నంద్యాల ఎంపి పోచా బ్రహ్మానంద రెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పాల్గొన్నారు.

'ఉపాధి' కల్పించండి..

గవర్నర్‌తో ముఖాముఖి సందర్భంగా పాణ్యం పంచాయతీ గిరిజన సర్పంచ్ ఎం పల్లవి మాట్లాడుతూ తమ గ్రామంలో ఉపాధి హామీ పథకం పనులను నిలిపివేశారని తెలిపారు. ఈ పనులను పున:ప్రారంభించి గిరిజనులకు ఉపాధి కల్పించాలని కోరారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు.

పింఛను నిబంధనల్లో మార్పుపై

ఫ్రాన్స్‌లో నిరసనల హోరు

- 31న దేశవ్యాప్త సమ్మె

పారిస్ : పింఛను నిబంధనల్లో మార్పు చేయాలన్న మాక్రాన్ ప్రభుత్వ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా పారిస్ సహా దేశవ్యాప్తంగా పలు నగరాలు గురువారం నిరసనలతో హోరెత్తిపోయాయి. పారిస్‌లో నాలుగు లక్షల మంది, దేశవ్యాప్తంగా 20లక్షల మంది నిరసనల్లో పాల్గొన్నారు. యువత, ప్రభుత్వ ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొనడంతో దేశమంతా స్తంభించిపోయింది. ఈ నెల 31న దేశవ్యాప్త సమ్మె, నిరసనలు చేపడుతున్నట్లు ఫ్రెంచి ఉద్యోగ, కార్మిక సంఘాలు శుక్రవారం ప్రకటించాయి. రిటైర్‌మెంట్ వయసు పెంచడానికి బదులుగా సంపన్నులపై పన్నులు వేయాలని డిమాండ్ చేశాయి. పారిస్‌లో పోలీసులు బాష్పవాయు గోళాలను ప్రయోగించి, నిర్బంధాన్ని ప్రయోగించారు. పెన్షన్ వ్యవస్థకు నిధులందించేందుకు యాజమాన్యాల నుంచి మరింత చెల్లింపులు జరిగేలా చూడాలని సంఘాలు కోరుతున్నాయి.

ఎస్‌సిఎస్‌టి సబ్‌ప్లాన్‌ను పొడిగించాలి

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితులకు, గిరిజనులకు బడ్జెట్‌లో చట్టబద్ధ వాటా కోసం అమలులో వున్న ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌కు 2023తో కాలపరిమితి ముగుస్తున్నందున మళ్లీ కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తగిన చర్యలను చేపట్టాలని దళిత, గిరిజన సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో జరిగిన ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి అధ్యక్షత వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జల్లి విల్సన్, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతం, జనసేన నాయకులు రమాదేవి, జైభీమ్ జైభారత్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కె కొండలరావు తదితరులు హాజరయ్యారు. అలాగే దళిత, ప్రజా సంఘాల నుండి కెవిపిఎస్ రాష్ట్ర నాయకులు జి నటరాజ్, జి క్రాంతికుమార్, డిబిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొరివి వినయ్‌కుమార్, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె సుబ్బారావు, దళిత గిరిజన బడ్జెట్‌వాచ్ అల్లాడి దేవకుమార్, డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధానకార్యదర్శి డి చిట్టిబాబు, నాయకులు ఉప్పులేటి దేవీ వరప్రసాద్, నేతి మహేశ్వరరావు, పేరుపోగు వెంకటేశ్వరరావు, నాగేంద్ర, రాజేష్, హేమ, చింతా వెంకటేశ్వర్లు, జగదీష్, డాక్టర్ అంకయ్య, మూర్తి, కె రాము, రాయప్ప తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దళితులు, గిరిజనులు పోరాడి సాధించుకున్న ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ 2023 జనవరి23తో ముగుస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పొడిగించేందుకు ఆర్డినెన్స్‌ను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టకుండా పక్కాగా అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి సబ్‌ప్లాన్‌ను కొనసాగించేందుకు స్పష్టమైన ప్రకటన చేసేదాకా ఉద్యమాన్ని అంచెలంచెలుగా ఉధృతం చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది.



సమావేశంలో మాట్లాడుతున్న ఆండ్ర మాల్యాద్రి

కొనసాగుతున్న ఓడి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ఖజానా ఇంకా ఓవర్‌డ్రాఫ్ట్‌లోనే కొనసాగుతోంది. ప్రస్తుతం 400 కోట్ల వరకు ఓడిలో ఉంది. జనవరి నుంచి ప్రారంభమైన ఈ త్రైమాసికంలో ఇది పదో రోజు కావడం విశేషం. అంటే 19 రోజుల్లో పది రోజులు ఓవర్‌డ్రాఫ్ట్‌లోనే ఉన్నట్టయింది. తొలి రోజు నుంచి వరుసగా ఎనిమిది రోజులు ఓడిలో ఉండగా, తరువాత అతికష్టంమీద ఓడి నుంచి బయటపడింది. అయితే మళ్లీ రెండు రోజులపాటు వరుసగా ఓడీలోనే ఉండడం విశేషం.

మరో ఇద్దరు సలహాదారులకు కేబినెట్ ర్యాంకు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సలహాదారుల నియామకంపై ఒకవైపు న్యాయస్థానంలో కేసు నడుస్తున్నా తాజాగా మరో ఇద్దరికి కేబినెట్ స్థాయిని కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత ఏడాది నవంబర్‌లోనే ఇద్దరిని సలహాదారులుగా నియమిస్తూ నిర్ణయం తీసుకోగా, వారికి తాజాగా కేబినెట్ స్థాయి కల్పించారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యవసాయ శాఖ సలహాదారుగా నియమితులైన ఐ.తిరుపాల్‌రెడ్డి, ఉద్యానవనశాఖకు సలహాదారుగా నియమితులైన పుట్టా శివప్రసాద్‌రెడ్డిలకు కేబినెట్ హోదా దక్కింది. వీరిద్దరికీ కేబినెట్ హోదాలో ప్రోటోకాల్ వర్తిస్తుందని పేర్కొన్న ప్రభుత్వం సిబ్బంది, ఇతర అలవెన్సులు మాత్రం ఉండవని ఉత్తర్వుల్లో పేర్కొంది. సలహాదారులకు పెద్ద మొత్తంలో ప్రజాధనం వ్యయం చేస్తున్నారన్న కోణంలో కూడా హైకోర్టులో వాదనలు జరుగుతున్న నేపథ్యంలోనే వారికి ఆర్థిక అంశాలతో కూడిన సౌకర్యాలు కల్పించలేదని అధికారులు అంటున్నారు. కాగా, తాజాగా కేబినెట్ హోదా దక్కిన వారిలో శివప్రసాద్‌రెడ్డి కడప జిల్లా కమలాపురంకు చెందిన వ్యక్తికాగా, తిరుపాల్‌రెడ్డి కూడా కడప జిల్లాకే చెందిన పులిరెడ్డిపేట గ్రామానికి చెందిన వారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.



సిఎంను కలిసిన పాటూరు రామయ్య

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కృష్ణా జిల్లా నిడుమోలు మాజీ ఎమ్మెల్యే పాటూరు రామయ్య శుక్రవారం భేటీ అయ్యారు. మర్యాద పూర్వకంగానే ఆయన సిఎంను కలిసినట్లు సిఎంఓ తెలిపింది.

57 మందికి డిప్యూటీ కలెక్టర్లగా పదోన్నతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా 57 మందిని డిప్యూటీ కలెక్టర్లుగా, పదోన్నతులు, బదిలీలను ప్రభుత్వం చేపట్టింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం జీఓ ఆర్‌టి నెంబరు 133ని విడుదల చేసింది. పబ్లిక్ సర్వీసెస్ , ఎపి సివిల్ సర్వీసెస్ (ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్)రూల్స్ 1992 ప్రకారం బదిలీలు, ప్రమోషన్లు, పోస్టింగ్స్ ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బుగ్గన రాజీనామా చేయాలి : జంగా గౌతమ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వ ఆర్థిక వ్యవస్థ నిర్వహణ చిన్నాభిన్నమైందని పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు జంగా గౌతమ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు జీతాల కోసం ప్రత్యేక చట్టం తేవాలని గవర్నర్‌ను అభ్యర్థించిన చరిత్ర గతంలో ఎప్పుడూ లేదని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి బాధ్యత వహించి రాష్ట్ర ఆర్థికమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జీఓ నెంబరు1పైన సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ప్రభుత్వానికి చెంపపెట్టుగా తమ పార్టీ భావిస్తోందని పేర్కొన్నారు.

22న కేంద్ర మంత్రి భారతీ ప్రవీణ్ పర్యటన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ ఈ నెల 22, 23 తేదీల్లో విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేటుకూరి సూర్యనారాయణ రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

ఫిబ్రవరిలోగా కార్మిక సభ్యత్వ నమోదు పూర్తి

- మంత్రి గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి నెలాఖరులోగా కార్మిక సభ్యత్వ నమోదు ప్రకియను పూర్తి చేయాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని మూడో బ్లాక్‌లో వైఎస్ఆర్ బీమా, లేబర్ సెస్ అంశాలపై కార్మికశాఖ, బీమా సంస్థల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. అర్హులైన ప్రతి కార్మికునికి లబ్ధి చేకూర్చేలా అధికారులు పనిచేయాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం సహకారం లేకుండా అమలు చేస్తున్నామన్నారు. ఫిబ్రవరిలోగా వైఎస్ఆర్ బీమా కింద పెండింగ్‌లో ఉన్న 262 దరఖాస్తులను క్లియర్ చేయాలన్నారు. బాధితులకు వైఎస్ఆర్ బీమా నియమిత కాలాన్ని బీమా క్లెయిమ్ చెల్లించాలని బీమా సంస్థల అధికారులను మంత్రి గుమ్మనూరు జయరామ్ ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్మికశాఖ కమిషనరు ఎంఎం నాయక్, గ్రామ వార్డు సచివాలయాల జాయింట్ డైరెక్టర్ వికాస్ మర్మట్, అదనపు లేబర్ కమిషనరు లక్ష్మీనారాయణ, సంయుక్త లేబర్ కమీషనర్లు రామారావు, రాణి, బాలు నాయక్, శ్రీనివాస్, ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధులు ,అధికారులు పాల్గొన్నారు.

పాదయాత్రకు లోకేష్ సన్నాహాలు

- టిడిపి ముఖ్య నాయకులతో భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

యువగళం పేరుతో ఈ నెల 27 నుంచి చేపట్టబోయే తన పాదయాత్రకు టిడిపి ప్రధానకార్యదర్శి నారా లోకేష్ సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం నాడు ఆయన టిడిపి ముఖ్యనేతలు, అనుబంధ సంఘాల నాయకులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమావేశమై సలహాలు, సూచనలు కోరారు.

400 రోజుల పాటు 4 వేల కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగుతుందని తెలిపారు. ఎన్టీఆర్ ఆశయాలను, చంద్రబాబు విజన్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు యువగళం మంచి వేదిక కాబోతుందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం చేసేందుకు అందరీ ఆశీస్సులతో పాదయాత్ర చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా ఎన్నో ఆశలతో జగన్‌కు ఛాన్స్ ఇస్తే సద్వినియోగం చేసుకోలేదని విమర్శించారు. కేవలం కక్షసాధింపు కోసమే అధికారాన్ని వాడుకుంటున్నారని తెలిపారు. మహిళలు, రైతులు, యువత, ఉద్యోగస్తులు ఆఖరికి పోలీసులు కూడా వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నారని తెలిపారు. జగన్ సర్కార్ దోపిడీ విచ్చలవిడిగా పెరిగిపోయిందని, లిక్కర్, ఇసుక, మైనింగ్ మాఫియాలతో రాష్ట్రాన్ని, ప్రజల్ని దోచుకుంటున్నారని విమర్శించారు. ప్రజలపై భారాన్ని విపరీతంగా పెంచారని, కరెంట్ చార్జీలు, నిత్యావసర సరుకుల ధరలు, ఆర్టీసీ చార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచేశారని తెలిపారు. యువగళం యాత్ర విజయవంతమయ్యేలా పార్టీ యంత్రాంగం కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు కోరారు. రాష్ట్రం మరలా అభివృద్ధిలో నడవాలంటే టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావాలని చెప్పారు.

యువగళానికి అనుమతి ఇవ్వండి : డిజిపికి టిడిపి లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'యువగళం' పాదయాత్రకు అనుమతులు మంజూరు చేయాలని టిడిపి కోరింది. ఈ మేరకు డిజిపికి ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య శుక్రవారం లేఖ రాశారు. పాదయాత్ర అనుమతులకు సంబంధించి ఇప్పటి వరకు ఎటువంటి స్పందన రాలేదని తెలిపారు. ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న యాత్రకు త్వరగా అనుమతులు ఇవ్వాలని తెలిపారు. అనుమతి ఇస్తే అవసరమైన ఏర్పాట్లు చేసుకునేందుకు వీలుగా ఉంటుందని పేర్కొన్నారు.

క్యూబా సంఘీభావ సభను జయప్రదం చేయండి

- పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిలబడి అమెరికా దాడులకు నిరంతరం నలిగిపోతున్న క్యూబాకు సంఘీభావంగా ఈ నెల 23న విజయవాడలో నిర్వహించే సభకు ప్రజాస్వామికవాదులంతా కలిసిరావాలని క్యూబా సంఘీభావ సభ నిర్వాహకులు కోరారు. ఈ సభకు సంబంధించిన పోస్టర్‌ను బాలోత్సవభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సభ కన్వీనర్లు సుంకర రాజేంద్రప్రసాద్, బుడ్డిగ జమిందారు, ఆహ్వాన సంఘం సభ్యులు వై వెంకటేశ్వరరావు, అక్కినేని వనజ ఆవిష్కరించారు. క్యూబా సంఘీభావ సభ ఆహ్వాన సంఘం ఆధ్వర్యాన జరుగుతున్న ఈ సభలో చేగువేరా కుమార్తె అలైదా గువేరా, మనుమరాలు ఎస్తోఫేనియా అలైదా గువేరా పాల్గొంటారని చెప్పారు. ప్రపంచంపై అమెరికా సాగిస్తున్న దుర్మార్గపు పోకడలకు వ్యతిరేకంగా గువేరా ప్రపంచ వ్యాప్తంగా పర్యటిస్తున్నారని తెలిపారు. క్యూబాను కాపాడుకొనేందుకు, అమెరికా నియంతృత్వంపై పోరాడేందుకు నిర్వహిస్తున్న పర్యటనల్లో భాగంగా క్యూబా జాతీయ సంఘీభావ కమిటీ ఆహ్వానం మేరకు భారతదేశంలో అలైదా పర్యటిస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 23న విజయవాడ రానున్నారని తెలిపారు. ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాలు, మేధావులు, సామ్రాజ్యవాద వ్యతిరేకులు ఆమెకు ఘనస్వాగతం పలకనున్నారని పేర్కొన్నారు. అమెరికా తన దోపిడీని అంతకంతకూ పెంచుకుంటూ పోతోందని దేశాలకు దేశాలనే కబళిస్తోందని తెలిపారు. పైకి పర్యావరణ రక్షణ అని చెబుతూ అభివృద్ధి చెందుతున్న దేశాలను మురికి కూపాలుగా, చెత్తకుండీలుగా మారుస్తోందని తెలిపారు. వినాశకర విధానాలను అనుసరిస్తూ లాటిన్ అమెరికాలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలుస్తోందని విమర్శించారు. క్యూబా, వెనిజులా లాంటి దేశాలు అమెరికాను ధీటుగా ఎదిరించి నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ప్రపంచ దేశాల సంఘీభావం కోసం క్యూబా తరపున అలైదా, ఎస్తోఫేనియా దేశానికి వస్తున్నారని వారికి సామ్రాజ్యవాద వ్యతిరేకులందరూ కలిసి పూర్తి సంఘీభావం ప్రకటించాలని తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సుంకర రాజేంద్రప్రసాద్, బుడ్డిగ జమింధారు, వై వెంకటేశ్వరరావు, వనజ

12వ పిఆర్‌సి వేయాలి

- ఎన్‌జిఓ నేత బండి శ్రీనివాసరావు
- ఉద్యమ నేతలపై విమర్శలు తగదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగుల పే రివిజన్‌కు సంబంధించి 12వ పిఆర్‌సి వేయాల్సి ఉందని, 11వ పిఆర్‌సి గడువు జూన్ నెలతో ముగుస్తుందని, ఈలోపే కమిటీలు వేయాల్సి ఉందని ఎన్‌జిఓ సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, శివారెడ్డి తెలిపారు. శుక్రవారం సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దీనికి సంబంధించి అనేక అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళుతున్నామని, అవసరమైతే అన్ని ంసఘాలను కలుపుకుని ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. దీనిపై అన్ని సంఘాలతోనూ చర్చిస్తున్నామని చెప్పారు. గత పిఆర్‌సిలో ప్రభుత్వం ఇచ్చిన హామీలకు సంబంధించి పలు అంశాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. డిఏ బకాయిలు సంక్రాంతి నాటికి ఇస్తామన్నారని, దీనిపై ఉత్తర్వులు వస్తాయని వివరించారు. ఎన్‌జిఓ సంఘం నూతనంగా ఎన్నికైన నేపథ్యంలో తాము మర్యాద పూర్వకంగా సిఎంను కలిసి వచ్చాయని చెప్పారు. ఇదే సమయంలోఉద్యోగుల సమస్యలకు సంబంధించిన పలు అంశాలను సిఎంకు తెలిపామని పేర్కొన్నారు. అయితే గవర్నర్‌ను కలిసిన అనంతరం ఉద్యోగ సంఘ నాయకుడు కెఆర్ సూర్యనారాయణ ఉద్యోగ సంఘాల నేతలపై వ్యక్తిగత విమర్శలు చేశారని, అది సరికాదని, దీనిపై తాము రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించనున్నామని చెప్పారు. ఉద్యోగ నిబంధనలకు విరుద్ధంగా ఆయన వ్యవహరిస్తున్నామని, ఆయన సంఘానికి అసలు గుర్తింపు లేదని పేర్కొన్నారు. దీనిపైనా ఫిర్యాదు చేస్తామని చెప్పారు. నిజంగా అతనికి ఉద్యోగుల బలం ఉంటే సమస్యలపై వెంటనే కార్యాచరణ ప్రకటించాలని డిమాండు చేశారు. ఎన్‌జిఓ సంఘ ఆస్తులకు సంబంధించి అతను వ్యక్తిగతంగా అనేక ఫిర్యాదు చేస్తున్నారని, అటువంటివి మానుకోకపోతే తగు రీతిలోనే సమాధానం చెబుతామని హెచ్చరించారు. ఎసిబి కేసుల్లో ఇరుక్కున్న ఉద్యోగులకు సంబంధించిన ఫైలు సిఎం వద్దకు తీసుకెళితే తిరస్కరించారని, దీంతో అతను ప్రభుత్వంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశారని వివరించారు. కేవలం వ్యక్తిగత లాభం కోసం అతను వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఎన్‌జిఓ కార్యనిర్వాహక కార్యదర్శి జగదీశ్వరరావు, క్యాపిటల్ సిటీ అమరావతి బ్రాంచ్ అధ్యక్షులు సిహెచ్.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్‌ను కలిస్తే తప్పేంటి : సూర్యానారాయణ

ఉద్యోగుల సమస్యలపై గవర్నర్‌ను కలిస్తే తప్పేంటని ఉద్యోగ సంఘ నాయకులు సూర్యనారాయణ, ఆస్కారరావు ప్రశ్నించారు. తాము గవర్నర్‌ను కలిసిన తరువాత ఎక్కడా ఎన్‌జిఓ పేరు ఎత్తలేదని పేర్కొన్నారు. అయినా వ్యక్తిగతంగా హెచ్చరించామనడం, ఖబడ్దార్ అనడం సరైంది కాదని పేర్కొన్నారు. అయినా బండి శ్రీనివాసరావు తదితరులు తమను ఏకపక్షంగా విమర్శించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. తమ సంఘం గుర్తింపు రద్దు చేస్తామని చెబుతున్నారని, గతంలోనే వారు ఫిర్యాదు చేస్తే ప్రభుత్వం వారి ఫిర్యాదును పక్కనబడేసిందని వివరించారు. తన వెనుక రాజకీయశక్తులు వున్నాయని చెప్పడంతో అర్థం లేదని పేర్కొన్నారు. తాను అవినీతి కేసుల్లో ఉన్నవారిని బయటపడేయాలని కోరలేదని, ఎసిబి కేసుల్లో గతంలో ఉన్న ఉత్తర్వులను అమలు చేయాలని మాత్రమే తాను కోరానని పేర్కొన్నారు.

గవర్నర్‌ను కలవడం తప్పే : బొత్స

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తమది ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ఉద్యోగులంతా తమ కుటుంబ సభ్యులని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలు గవర్నర్‌ను కలవడం ముమ్మాటికే తప్పని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఓ టివి ఛానెల్‌తో ఆయన మాట్లాడుతూ వ్యాఖ్యలు చేశారు. 'నేను ఎవరినీ బెదిరించనని, విజ్ఞప్తులు చేయన'న్నారు. అన్నింటికి కాలమే సమాధానం చెబుతుందన్నారు. ఉద్యోగుల సమస్యలపై చర్చిస్తూనే ఉన్నామని బొత్స పేర్కొన్నారు.

కృష్ణా జలాలపై విచారణ మార్చి14కి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా జలాల పంపకంపై దాఖలైన పిటిషన్ల విచారణను సర్వోన్నత న్యాయస్థానం మార్చి 14కి వాయిదా వేసింది. కృష్ణా జలాల పంపకంపై కర్ణాటక 2014లో దాఖలు చేసిన ఒరిజినల్ పిటిషన్ తో పాటు వ్యాజ్యకాలీన దరఖాస్తు(ఐఎ)పై జనవరి 10, 11ల్లో సుప్రీంకోర్టులో సుదీర్ఘ వాదనలు కొనసాగాయి. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల తరపు న్యాయవాదులు ఆయా రాష్ట్రాల వాదనలు వినిపించారు. తాజాగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి. రామసుబ్రమణియన్ తో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం పిటిషన్ల విచారణను చేపట్టాయి. ఇతర పిటిషన్ల విచారణలో తలమునకలుగా ఉన్నందున తరువాత విచారణ చేపడతానని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. ఈదశలో కర్ణాటక, మహారాష్ట్ర తరపు సీనియర్ న్యాయవాదులు శ్యాం దివాన్, నఫడే త్వరగా కేసు విచారణను పూర్తి చేయాలని, ఏళ్ల తరబడి న్యాయస్థానంలో కేసు ఉండిపోతోందని తెలిపారు. తమకు తగిన సమయం కేటాయించాలని తెలంగాణ తరపు సీనియర్ న్యాయవాది సిఎస్ వైద్యనాథన్ కోరారు. అవసరమైన వివరాల అందజేతకు, తమ వాదనలు వినిపించేందుకు సిద్ధమేనని కేంద్రం తరపు న్యాయవాదులు తెలిపారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎన్.రామారావు

'ఉక్కు' పోరాటంలో భాగస్వాములుకండి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకునేందుకు జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఎన్.రామారావు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 708వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ సిఎంఎం, సిఆర్‌ఎంపి, లూబ్రికేషన్, హైడ్రాలిక్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా ఉక్కు పోరాటం కొనసాగుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. మోడీ సర్కారు మొండి వైఖరిని నిరసిస్తూ ఈ నెల 30న ఉక్కునగరంలోని తృష్ణా మైదానంలో తలపెట్టిన ఉక్కు ప్రజా గర్జన సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఈ సభకు సంబంధించిన ప్రచారం వాడవాడలా హోరెత్తుతోందన్నారు. అన్ని రాజకీయ పార్టీలనూ, సంఘాలనూ కలుపుకొని ఒకే వేదికపై ఉక్కు నినాదాన్ని వినిపించనున్నట్టు తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్రం ప్రకటించే వరకూ పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

పోలీస్ నియామక పరీక్షకు గుర్తింపు కార్డు తప్పనిసరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పోలీసు నియామకాల కోసం ఈ నెల 22న జరిగే పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తెచ్చుకోవాల్సివుంటుంది. ఈ మేరకు రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆధార్, పాన్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ కార్డు, రేషన్ కార్డులలో ఏదొకటి ఒరిజనల్ పత్రం వెంట తెచ్చుకోవాలని సూచించింది. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, పెన్‌డ్రైవ్, బ్లూటూత్, స్మార్ట్‌వాచ్, క్యాలిక్యులేటర్, లాగ్ టేబుల్, వాలెట్, పర్సు, నోట్స్, చార్ట్‌లు తీసుకురాకూడదని తెలిపింది. అభ్యర్థులను ఉదయం 9 గంటలకు పరీక్ష హాలులోకి అనుమతిస్తారని, ఈ లోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా 6,100 కానిస్టేబుల్ పోస్టుల రిక్రూట్‌మెంట్ కోసం 5,03,486 మంది పరీక్షకు హాజరుకానున్నారు.

జర్నలిస్టులకు వృత్తి పన్ను నోటీస్‌లను ఉపసంహరించుకోవాలి

- ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వర్కింగ్ జర్నలిస్టులు వృత్తి పన్ను చెల్లించాలని ప్రభుత్వ వాణిజ్య పన్నుల శాఖ జారీ చేసిన నోటీస్‌లను తక్షణం ఉపసంహరించుకోవాలని ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్ వెంకట్రావ్, జి ఆంజనేయులు, ఎపిబిజెఎ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, అలీ ఒక ప్రకటన విడుదల చేశారు. జర్నలిస్టుల వేతనాలు, ఉద్యోగభద్రత గురించి ఏనాడు ఆలోచించని ప్రభుత్వాలు వృత్తి పన్ను చెల్లించాలని నోటీస్‌లు ఇవ్వడం సరైందికాదన్నారు. గతంలో రాజంపేటలో వృత్తిపన్ను విధిస్తూ నోటీసు ఇస్తే రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఆందోళనలు చేస్తే ఉపసంహరించుకున్నారని మళ్లీ ఇప్పుడు అమలాపురంలో ఏకంగా ఐదేళ్ల నుండి వృత్తిపన్నును చెల్లించాలని నోటీస్ పంపడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణం ఈ నోటీస్‌లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

వైద్య సేవలపై డ్యాష్‌బోర్డు

- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య విధానంపై అవగాహన కల్పించడంతో పాటు అందుబాటులో ఉన్న వైద్య సేవలపై డ్యాష్ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని అధికారులను ఆదేశించారు. మంగళగిరిలోని ఎపిఐఐసి భవనంలో వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త ఎంఎంయూ (104) వాహనాల వినియోగానికి సర్వం సిద్ధం చేయాలని, వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను కోవిడ్ నోడల్ కేంద్రాలుగా వినియోగించుకోవాలన్నారు. అన్ని ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కియోస్క్‌లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య విధానంలో భాగంగా వైద్యాధికారులు తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించాల్సిందేనని, వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు కావాలని సూచించారు. రోగులకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా బిల్లులు చెల్లించే సమయంలో ఆయా ఆసుపత్రుల పరిధిలోని ఎఎన్‌ఎంల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోవాలని సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, కమిషనరు జె.నివాస్, ఎపివివిపి కమిషనరు డాక్టర్ వినోద్‌కుమార్, ఎపిఎంఎస్ఐడిసి ఎండి మురళీధర్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ సిఇఓ హరీంద్రప్రసాద్, డ్రగ్స్ కంట్రోల్ డిజి హెచ్ డాక్టర్ వేమిరెడ్డి రామిరెడ్డి తదితరులు సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు.

త్వరలో వెలిగొండ నిర్వాసితులకు ప్యాకేజీ

- అర్హత ఉన్నవారికి అన్యాయం జరగదు : మంత్రి సురేష్

పజాశక్తి-పెద్దారవీడు (ఒంగోలు)

త్వరలో పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. నిర్వాసితులకు ప్యాకేజీ ఇచ్చేందుకు కసరత్తు జరుగుతోందని చెప్పారు. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టులో శుక్రవారం సచివాలయ కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వెలిగొండ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని భరోసానిచ్చారు. ఆ గ్రామ వాసిగా ఏ చిన్న ఆధారం ఉన్నా... ప్యాకేజీ ఇవ్వనున్నట్లు తెలిపారు. కలెక్టర్, స్పెషల్ కలెక్టర్లకు తాను ఇదే విషయం చెప్పానని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని నిర్వాసితులకు ధైర్యం చెప్పారు. అర్హత ఒక్కటే ప్రామాణికంగా తీసుకుని సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. తమలో ఎన్ని గ్రూపులున్నా ఎన్నికల నాటికి కలిసి నడుస్తామన్నారు. వైసిపిని ఎదుర్కొనలేకనే టిడిపి-జనసేన ఒక్కటవుతున్నాయని ఎద్దేవా చేశారు. ఆ ఇద్దరే కాదు... ఇంకెందరు కలిసినా సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకోలేరన్నారు.

బిజెపి మోసాన్ని నిలదీద్దాం

మొదటి పేజీ తరువాయి

పోరాటం సాగించాలన్నారు.

పి.మధు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా తీరని ద్రోహం చేసిందన్నారు. ఈ అన్యాయాన్ని ప్రశ్నించడంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి విఫలం అయ్యారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి బాధ్యత చూడాల్సిన కేంద్రం నేటికీ దానిని పూర్తి చేయలేదని తెలిపారు. ప్రత్యేక హోదా సాధిస్తానని ప్రతిపక్షంలో ఉన్న సమయంలో జగన్మోహన్‌రెడ్డి చెప్పి, అధికారంలోకి రాగానే దాని ఊసెత్తకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ప్రత్యేక హోదా సాధనకు చేపట్టిన బస్సు యాత్రను ఆపే హక్కు ఎవరికీ లేదన్నారు. హోదా కోసం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ధర్మ పోరాటానికి రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలూ కలిసి రావాలని కోరారు. ప్రత్యేక హోదా పోరాటంలో చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ కలిసి రాకుంటే ప్రజాద్రోహులుగా మిగులుతారన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న కుమార్, డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా కోసం చేపట్టిన ఈ ఉద్యమం ప్రారంభం మాత్రమేనని, ఇది ఆగదని, రాష్ట్ర వ్యాప్తంగా దీనిని కొనసాగిస్తామని తెలిపారు. రాష్ట్రం భవిష్యత్తు కోసం చేపట్టిన బస్సు యాత్రను న్యాయస్థానం అనుమతి ఇచ్చిన వెంటనే హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపడుతామన్నారు. బిజెపికి చిత్తశుద్ధి ఉంటే వెంకన్న సాక్షిగా ఇచ్చిన హోదా హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ అధ్యకత వహించారు.

ఘనంగా ఎన్ఐడి మొదటి స్నాతకోత్సవం

ప్రజాశక్తి - ఏఎన్‌యు (గుంటూరు జిల్లా)
ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్ఐడి) మొదటి స్నాతకోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 49 మందికి బ్యాచిలర్ ఇన్ డిజైన్ డిగ్రీలను ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ చేనేత, జౌళి శాఖ, ప్రధాన కార్యదర్శి కొలవంతి సునీత ముఖ్యఅతిథిగా ప్రారంభోపన్యాసం చేశారు. ఎన్ఐడి విద్యార్థులు సృజనాత్మకంగా ఉండాలని, ఉత్తమ నైపుణ్యాలతో జీవితంలో స్థిరపడ్డానికి అవకాశాలు మెండుగా ఉంటాయని చెప్పారు. ఒడిదుడుకులను అధిగమిస్తేనే జీవితం సార్థకతవుతుందన్నారు. హాండ్లూమ్స్‌లో 33, హ్యాండీ క్రాఫ్ట్‌లో 25 విభాగాలున్నాయని, వాటిని అధ్యయనం చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు డిగ్రీలను గవర్నింగ్ కౌన్సిల్ అధ్యక్షులు, వాణిజ్య శాఖ సెక్రెటరీ ఆర్‌కె సింగ్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఐడి డైరెక్టర్ ప్రొఫెసర్ శేఖర్ ముఖర్జీ, డిప్యూటీ రిజిస్ట్రార్ పీయూష్ శర్మ, ఐఐటి తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎన్ఐడి 2015లో విభజన హామీల్లో భాగంగా రాష్ట్రంలో స్థాపితమైంది. భారత వాణిజ్య మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వయంప్రతిపత్తి గల రెండవ సంస్థ ఇది. దీన్ని తాత్కాలికంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తుండగా రాజధాని అమరావతిలో 50 ఎకరాల విస్తీర్ణంలో భవన నిర్మాణ పనులు చేపట్టారు. పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయినట్లు తెలిసింది.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌పై దాడి అమానుషం

- మహిళా సంఘాల నిరసన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్
దేశ రాజధాని ఢిల్లీలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌పైనే దాడిని ఖండిస్తూ తిరుపతి అంబేద్కర్ విగ్రహం వద్ద ఐద్వా, మహిళా సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు మాసుపల్లి జయంతి, మహిళా సమాఖ్య నాయకురాలు మంజుల మాట్లాడుతూ.. మహిళల భద్రతా చర్యలను పరిశీలించడానికి ఢిల్లీ వెళ్లిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌పై దాడి జరగడం హేయమైన చర్యన్నారు. చైర్‌పర్సన్‌కే రక్షణ లేకపోతే సాధారణ మహిళల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ సంఘటనతోనైనా మహిళలపై దాడులు ఏ విధంగా జరుగుతున్నాయో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్థం చేసుకోవాలన్నారు. మహిళలపై దాడుల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమ్మాజీ, అమ్ములు, రమాదేవి, పుష్ప, ప్రమీల పాల్గొన్నారు.

'ప్రయాస్' నివేదిక బయటపెట్టాలి

- ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలపై భారం మోపొద్దు
- రెండో రోజు ప్రజాభిప్రాయ సేకరణలో విజ్ఞప్తులు



పబ్లిక్ హియరింగ్‌లో ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి, కడప అర్బన్
రాష్ట్రంలో వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్ల బిగింపుపై రాష్ట్రప్రభుత్వం ప్రయాస్ ఎనర్జీ గ్రూప్‌తో నిర్వహించిన సర్వే నివేదికను బయటపెట్టాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఎపిఇఆర్‌సి)కి పలువురు కోరారు. ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలకు విద్యుత్ రాయితీ కొనసాగించాలని కోరారు. డిస్కంల ప్రతిపాదించిన ఎఆర్‌ఆర్‌పై ఎపి విద్యుత్ నియంత్రణ మండలి(ఎపిఇఆర్‌సి) ప్రజాభిప్రాయ సేకరణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెండోరోజు శుక్రవారం కూడా కొనసాగింది. చైర్మన్ సివి నాగార్జున రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముందుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ వెనుకబడిన ఉత్తరాంధ్రలో 25 వేల మందికిపైగా ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ఛార్జీలు పెంచితే, అవి మూతపడి కార్మికులు వీధిన పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పుడు వేల కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి స్మార్ట్ మీటర్లు కొనాల్సిన అవసరమేముందని ప్రశ్నించారు. ప్రభుత్వ తప్పుడు విధానాల వల్ల ప్రజలపై విద్యుత్ భారాలు పెరుగుతున్నాయని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులు వి కృష్ణయ్య మాట్లాడుతూ వ్యవసాయ ఉచిత విద్యుత్‌కు కట్టుబడి ఉన్నామని చెబుతునే రాష్ట్రప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగింస్తోందన్నారు. ఇందులో కుట్ర దాగి ఉందని విమర్శించారు. మీటర్లు వల్ల నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మీటర్లు బిగింపు ప్రక్రియను ఎపిఇఆర్‌సి క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల అభిప్రాయాలు తెలుసుకోవాలని కోరారు. ఒకే దేశం, ఒకే గ్రిడ్, ఒకే ఫ్రీక్వేన్సీ, ఒకే ధర పేరుతో రాష్ట్ర ఇఆర్‌సిలను బొమ్మలుగా చేసి కేంద్రం ఇఆర్‌సిలకే అధికారాలు కట్టబెట్టేందుకు కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. స్థానికంగా శ్లాబులు నిర్ణయించే అధికారం రాష్ట్ర ఇఆర్‌సిలు లేకుండా చేస్తోందన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం బాలకాశీ మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. రెగ్యులర్ చేసేంతవరకు విద్యుత్ సంస్థలే నేరుగా కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రిపెయిడ్ మీటర్ల వల్ల మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలపై ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని ఎపి ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు ఎంవి ఆంజనేయులు కోరారు. తమ పరిశ్రమలకు 2022-23 టారీఫ్‌ను, రాయితీలను కొనసాగించాలని ఎపి ఫెర్రో అల్లాస్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ నాయకులు శర్మ కోరారు. అదనపు లోడు పేరుతో వినియోగదారులపై భారాలు మోపద్దని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె మురళి కోరారు. చిన్నతరహా పరిశ్రమలకు విద్యుత్ రాయితీలు కల్పించి ప్రోత్సహించాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గునాయుడు కోరారు. విద్యుత్ కంపెనీలతో గతంలో కుదుర్చుకున్న కొనుగోలు ఒప్పందాలను పున:సమీక్షించాలని సిపిఎం విశాఖ కార్పొరేటర్ బి గంగారావు కోరారు. ఈ కార్యక్రమంలో ఇఆర్‌సి కార్యదర్శి రాజబాపయ్య, సభ్యులు ఠాకూర్‌రామ్‌సింగ్, పి రాజగోపాల్‌రెడ్డి, డిస్కంల సిఎండిలు కె సంతోషరావు, జె పద్మజనార్ధన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాయిదా సరికాదు
- ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

ముందస్తు రిజిస్ట్రేషన్ చేయించుకున్నా అర్ధాంతరంగా బహిరంగ విచారణను విద్యుత్తు రెగ్యులేటరీ కమిషన్ వాయిదా వేయడాన్ని నిరసిస్తూ విద్యుత్తు భవన్ ఎదుట ఎపి రైతు సంఘం, సిపిఎం నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. బహిరంగ విచారణకు కడప విద్యుత్ భవన్‌కు రావాలని 20వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు విద్యుత్ శాఖ అధికారులు సమాచారం ఇచ్చారని తెలిపారు. అరగంట ముందే విద్యుత్తు భవన్‌కు వస్తే ఆన్‌లైన్ విచారణ వాయిదా వేశామని సిబ్బంది చెప్పడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. వివిధ సంఘాలు, ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచేందుకు మూడు రోజులపాటు బహిరంగ విచారణకు విద్యుత్తు శాఖ నియంత్రణ మండలి ఆదేశాలు ఇచ్చిందన్నారు. తాము ఇక్కడికి వస్తే వాయిదా వేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, సభ్యులు దస్తగిరిరెడ్డి పాల్గొన్నారు.

హైడ్రో ప్రాజెక్టులు వద్దు

- గిరిజనుల సదస్సులో అప్పలనర్స


సదస్సులో మాట్లాడుతున్న అప్పలనర్స

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)
గిరిజనులకు నష్టం చేకూర్చే హైడ్రో పవర్ ప్రాజెక్టులను అల్లూరి జిల్లా ఏజెన్సీలో ఏర్పాటు చేయొద్దని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ్ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పలనర్స అన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు బాధిత గ్రామాల గిరిజనులతో స్థానిక గిరిజన భవన్‌లో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలనర్స మాట్లాడుతూ.. ఎర్రవరం, పెదకోట, చిట్టంపాడు, గుజ్జెలి ప్రాంతాల్లో సుమారు 5100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం హైడ్రో పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర కేబినెట్‌లో 2022 డిసెంబర్ 13న నిర్ణయించారని, నెడ్ క్యాప్‌ను నోడల్ ఏజెన్సీగా ఏర్పాటు చేసి కార్పొరేట్ కంపెనీలకు అటవీ సంపదను దోచిపెట్టడానికి ఆయా ప్రాంతాల్లో ఎనిమిది ప్రాజెక్టులు నిర్మిస్తామని పేర్కొన్నారన్నారు. గ్రామ ప్రజల అభిప్రాయాలు తెలుసుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హైడ్రో పవర్ ప్రాజెక్టు ఏర్పాటుపై ప్రకటన జారీచేయడంతో గిరిజనులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. గిరిజన సలహా మండలి (టిఎసి)ని సంప్రదించకుండా హైడ్రో పవర్ ప్రాజెక్టుపై రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడం రాజ్యాంగ ధిక్కరణే అవుతుందన్నారు. గిరిజన చట్టాలను ఉల్లంఘించి ప్రభుత్వాలు ముందుకు వెళ్లరాదని తెలిపారు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పి.లక్కు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె.పృథ్వీరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు పి.ధనుంజయ్, ఎర్రవరం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ వ్యతిరేక కమిటీ నాయకులు రామకృష్ణ పడాల్, పెదకోట, చిట్టంపాడు ప్రాంత నాయకులు పాల్గొన్నారు.

పెద్ద మనసుంటే ప్రజావేదిక కూల్చేవారా?

- పాఠశాలల్లో గ్రామ సచివాలయాల కేసులో హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి
ప్రజల డబ్బుతో కట్టిన ప్రజావేదికను రాత్రికి రాత్రి కూల్చేసిన ప్రభుత్వం కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా పాఠశాలల ఆవరణల్లో గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా భవనాలను ఎలా నిర్మిస్తుందని హైకోర్టు నిలదీసింది. వాటిని విద్యావసరాల నిమిత్తం వినియోగిస్తామని చెప్పే ప్రభుత్వం అదే వైఖరిని ప్రజావేదిక విషయంలో ఎందుకు అవలంబించలేకపోయిందని సూటిగా ప్రశ్నించింది. నిజంగానే ప్రభుత్వానికి అంత విశాల హృదయం ఉంటే ప్రజావేదిక కూల్చాల్సిన అవసరమేంటని నిలదీసింది. పాఠశాలల ఆవరణలో రైతుభరోసా, గ్రామ, వార్డు సచివాలయాల భవనాల నిర్మాణాలు చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను జస్టిస్ బి దేవానంద్ విచారణ జరిపారు. ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌ను కోర్టుకు సహాయకారి (అమికస్‌క్యూరీ)గా ఉన్న సీనియర్ అడ్వొకేట్ కేఎస్ మూర్తికి అందజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

పాఠశాలల ఆవరణలో గ్రామ సచివాలయ భవనాల విషయంలో ఒకలా, ప్రజావేదిక భవనం విషయంలో ప్రభుత్వ వైఖరి ఉందని తప్పుపట్టింది. పాఠశాలల ఆవరణల్లో ఇతర అవసరాల నిమిత్తం ఎలాంటి నిర్మాణాలు చేయరాదని 2020 జూన్‌లో హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయినా వాటి నిర్మాణాలను ప్రభుత్వ అధికారులు కొనసాగించారు. దీంతో 2021లో దాఖలైన కోర్టు ధిక్కార కేసులను శుక్రవారం హైకోర్టు మరోసారి విచారణ జరిపింది. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించి చేసిన నిర్మాణాలు అక్రమమే అవుతాయని వ్యాఖ్యానించింది. వాటికి అయిన బిల్లుల చెల్లింపులు కూడా అదే కోవలోకి వస్తాయంది. బిల్లుల మొత్తాలను సంబంధిత ఆఫీసర్ల నుంచి రాబడతామని హెచ్చరించింది. గత విచారణకు వ్యక్తిగతంగా హాజరైన సీఎస్ జవహర్‌రెడ్డిని ఆదేశించిన మేరకు దాఖలు చేసిన అఫిడవిట్‌ను పరిశీలించింది. ఆ నిర్మాణాల్ని పాఠశాలల అవసరాలకే వినియోగిస్తామని గవర్నమెంట్ స్పెషల్ ప్లీడర్ సుమన్ చెప్పారు. అవి కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా నిర్మాణం చేసినవేనని అంగీకరించారు .

సిఎంతో అలుక్కాస్ వర్గిస్‌జాయ్ భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో జోయలుక్కాస్ చైర్మన్, ఎండి అలుక్కాస్ వర్గిస్ జాయ్ శుక్రవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులు, అవకాశాలపై ఇద్దరి మధ్య చర్చ జరిగింది. పారిశ్రామికంగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి ఎలాంటి సహాయ సహకారాలు అందించడానికైనా సిద్ధంగా ఉన్నామని, రాష్ట్రంలో పారిశ్రామికంగా అనుసరిస్తున్న పారదర్శక విధానాలను సిఎం వివరించారు. రాష్ట్రంలో సుశిక్షుతులైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో జోయలుక్కాస్ సిఓఓ హెన్రీ జార్జ్, రవిశంకర్ గ్రూప్ చైర్మన్ కంది రవిశంకర్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలి : ఎన్‌ఎంయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఆర్‌టిసి ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థికపరమైన సమస్యలను పరిష్కరించాలని ఎపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటి అసోషియేషన్ (ఎన్‌ఎంయు) కోరింది. ఈ మేరకు ఎన్‌ఎంయు రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు పివి రమణారెడ్డి, వై శ్రీనివాసరావులు శుక్రవారం రాష్ట్ర అకౌంట్స్ అండ్ ట్రెజరి డైరక్టర్‌కు అందజేశారు. ఆర్‌టిసి ఉద్యోగులకు 2022నుండి రావాల్సిన అలవెన్స్‌లు, ఓటిలను చెల్లించాలని కోరారు. వేతనాలతోపాటే వాటిని చెల్లించాలని కోరారు. 2020 జనవరిలో పదోన్నతులు పొందిన 2,086 మంది ఉద్యోగులకు పిఆర్‌సిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2020నుండి బకాయి వున్నలీవ్‌ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిలను తక్షణం చెల్లించాలని కోరారు. రిటైర్డ్ ఆర్‌టిసి ఉద్యోగులకు చెల్లించాల్సిన అన్ని రకాల రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

దృష్టిలోపం ఉన్న ఉద్యోగులకు ఎఫ్‌ఆర్‌బిఎఎస్ మినహాయింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
దృష్టిలోపం ఉన్న ఉద్యోగులకు ఫేసియల్ రికగ్నేజేషన్ బేస్డ్ అటెండెన్స్ సిస్టమ్ (ఎఫ్‌ఆర్‌బిఎఎస్) నుంచి ప్రభుత్వం మినహాయింపు నిచ్చింది. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం జీఓ నెంబరు 1ని విడుదల చేసింది. డిఫరెంట్లీ ఎబిల్డ్, ట్రాన్స్‌జెండర్, సీనియర్ సిటిజన్స్ . విజయవాడ డైరెక్టర్ నుంచి హాజరు మినహాయింపు కోరుతూ పంపిన నివేదిక ఆధారంగా దృష్టిలోపంఉన్న ఉద్యోగులకు ఎఫ్‌ఆర్‌బిఎఎస్ నుంచి మినహాయింపు నిచ్చింది.

పాఠశాలల్లో ప్రవీణ్ ప్రకాష్ తనిఖీలు

- టీచర్‌పై సస్పెన్షన్ వేటు
- ఆర్‌జెడి, ఎఇ, డిఇ, ఇఇలకు ఛార్జి మెమోలు


రామభద్రపురం జెడ్‌పి హైస్కూలులో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి-బొబ్బిలి (విజయనగరం జిల్లా)
విజయనగరం జిల్లాలోని బొబ్బిలి, రామభద్రపురం మండలాల్లో పలు పాఠశాలలను శుక్రవారం పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పరిశీలించారు. ఎస్ఎ 1 పరీక్షా పేపర్లు వాల్యుయేషన్ చేయలేదని ఒక ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయాలని ఆదేశించగా, పర్యవేక్షణ సరిగా లేదంటూ ఆర్‌జెడి, పాఠశాల హెచ్ఎం, నాడు-నేడు పనులు పర్యవేక్షిస్తున్న ఎఇ, డిఇ, ఇఇలకు ఛార్జీ మెమోలు జారీ చేస్తామని తెలిపారు. బొబ్బిలి పట్టణంలోని నరేంద్రదేవ్ మున్సిపల్ పాఠశాలను తొలుత తనిఖీ చేశారు. 4,5 తరగతుల గదిలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్‌ను ఎస్ఎ-1 పరీక్షల్లో విద్యార్థులకు మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్నించగా పరీక్ష పేపర్లు వ్యాల్యూషన్ చేయలేదని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవీణ్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలను సక్రమంగా పర్యవేక్షణ చేయకపోవడంతో ఆర్‌జెడి జ్యోతికుమారికి ఛార్జి మెమో జారీ చేస్తామని చెప్పారు. అనంతరం పిరిడి జడ్‌పి ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన ఆయన విద్యార్థులకు పలు ప్రశ్నలు వేశారు.

వర్కు బుక్‌లు పరిశీలించారు. జనవరి నెలకు ఒకటవ వర్కు బుక్ పూర్తి కావాల్సి ఉన్నా సగమైనా పూర్తి చెయ్యక పోవడంతో ప్రధానోపాధ్యాయినిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెకూ ఛార్జి మెమో ఇవ్వాలని ఆర్‌జెడిని ఆదేశించారు. పాఠశాలలో 40 రోజులుగా ఆర్ఓ ప్లాంట్ పనిచేయని తీరుపై ఎఇ, డిఇ, ఇఇలకు ఛార్జీ మెమోలు జారీ చేస్తామని తెలిపారు. అనంతరం రామభద్రపురం జడ్‌పి హైస్కూలును తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు తెన్నులు పరిశీలించి స్వయంగా విద్యార్థులకు భోజనాలు వడ్డించి, ఆయనా రుచి చూశారు. మిడ్‌డే మీల్స్ లెక్కలపై తప్పుడు సమాచారం ఇచ్చిన ఎంఇఒపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఇఒ, డిప్యూటీ డిఇఒ, ఆర్‌జెడి సైతం తడబడి సక్రమ గణాంకాలు చెప్ప లేకపోవడంతో ఒకింత అసహనానికి గురయ్యారు. విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యే ప్రభుత్వ లక్ష్యంగా అనేక సంస్కరణలు ప్రభుత్వం తీసుకువస్తోందని, అందుకోసం రూ.40 వేల కోట్లు ఖర్చు చేస్తోందని అన్నారు. ఆయన వెంట ఆర్‌జెడి జ్యోతి కుమారి, డిఇఒ లింగేశ్వర రెడ్డి, డిప్యూటీ డిఇఒ తిరుపతి నాయుడు, తదితరులు ఉన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగులకు హయ్యర్ ఇపిఎఫ్ ఆప్షన్ అవకాశం కల్పించాలి

- ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఆర్‌టిసి ఉద్యోగులకు హయ్యర్ ఇపిఎఫ్ ఆప్షన్ అవకాశం కల్పించాలని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలానిభాష, రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, ఎం అయ్యపరెడ్డిలు ఎపిఎస్ ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేశాక ఆర్‌టిసి ఉద్యోగులందరికీ పెన్షన్ సౌకర్యం వస్తుందని ఆశించారని అయితే ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేయకపోవడంతో ఆర్‌టిసి ఉద్యోగులకు పెన్షన్ అనేది కలగా మిగిలిపోయిందని తెలిపారు. ఈ నేపథ్యంలో రిటైర్డ్ అయ్యాక మెరుగైన ఈపిఎఫ్ పెన్షన్ కోసం ఉద్యోగులు హయ్యర్ ఇపిఎఫ్ కోసం ఆప్షన్‌ను తీసుకుంటే అధికారులు తిరస్కరిస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగునంగా ఇపిఎఫ్ హయ్యర్ ఆప్షన్‌కు విల్లింగ్ ఇచ్చిన వారందరికీ అనుమతించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి : ఇయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఆర్‌టిసి ఉద్యోగులకు పెండింగ్‌లో వున్న లీవ్‌ఎన్‌క్యాష్‌మెంట్, అలవెన్స్‌లు, ఓటిలను చెల్లించడంతో పాటు అపరిష్కృత సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఎపిపిటిడి ఎంప్లాయిస్ యూనియన్ (ఇయు) డిమాండ్ చేసింది. శుక్రవారం విజయవాడలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ ప్రధానకార్యదర్శి పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ప్రతినెలా వేతనంతోపాటు చెల్లించాల్సిన అలవెన్స్‌లు, ఓటిలను ప్రభుత్వం ఐదు నెలలుగా పెండింగ్‌లో పెట్టడం సరైందికాదన్నారు. ఇన్సెంటివ్‌లు, వేతనాలు, పిఆర్‌సి సంబంధిత సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. ఇయు 27వ రాష్ట్ర మహాసభ వచ్చే ఏప్రిల్‌లో విజయవాడలో జరుగుతాయని తెలిపారు.

తిరుమలకు వెళ్లి వస్తుండగా..

- రోడ్డు ప్రమాదం ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి - చాపాడు (కడప జిల్లా)
కడప జిల్లాల్లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బొగ్గు లారీని టెంపో వ్యాన్ ఢీ కొట్టడంతో ముగ్గురు మరణించారు. ఎనిమిది మంది గాయపడ్డారు. తిరుమలకు వెళ్లి వస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లాలోని మైదుకూరు నుంచి ప్రొద్దుటూరుకు వెళ్తున్న బొగ్గు లారీని చాపాడు వద్ద వెనుక వైపు నుంచి టెంపో వాహనం ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీకి చెందిన కుడుముల రామలక్ష్మమ్మ (52), ఓబులమ్మ (47), సాలెం అనూష (28) అక్కడికక్కడే మరణించారు. కుడుముల గంగిరెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, జయలక్ష్మి, రామాంజనేయమ్మ, విజయ్ కుమార్‌రెడ్డి, గంగా అనిత, ఆంజనేయరెడ్డి గాయపడ్డారు. వీరిని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వీరిలో రామకృష్ణారెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు, గంగిరెడ్డిని ప్రొద్దుటూరులోని కెవిఆర్ వైద్యశాలకు తరలించారు. మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను ప్రొద్దుటూరు ఎమ్మెల్యే శివప్రసాద్ పరామర్శించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



హెరిటేజ్ నుంచి 'గ్లూకోశక్తి'

హైదరాబాద్ : హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ మార్కెట్లోకి రెండు కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఇన్‌స్టంట్ ఎనర్జీ డ్రింక్ గ్లూకోశక్తి, మరొకటి క్రీమీలీషియస్ పెరుగు ఉన్నాయి. శ్రమించే వారికి అప్ప టికప్పుడు శక్తిని అందించేందుకు గ్లూకోశక్తి దోహదం చేస్తుందని పేర్కొంది. ఇందులో సోడియం, పొటాషియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం ఖనిజాలుం టాయని ఆ కంపెనీ వైస్ చైర్‌పర్సన్, ఎండి నారా భువనేశ్వరి పేర్కొన్నారు. 200 ఎంఎల్ ధరను రూ.10గా నిర్ణయించారు. బత్తాయి రుచితో కూడిన 200 ఎంఎల్ ఎనర్జీ డ్రింక్ ప్యాక్ ధర రూ.10గా ప్రకటించారు.

రిలయన్స్‌కు రూ.17,806 కోట్ల లాభాలు



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.17,806 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3 లాభాలు రూ.20,539 కోట్లతో పోల్చితే 13.3 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. కాగా.. 2022 సెప్టెంబర్ త్రైమాసికం లాభాలు రూ.15,512 కోట్ల లాభాలతో పోల్చితే 14.78 శాతం పెరుగుదల నమోదయ్యింది. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ 15.32 శాతం వృద్ధితో రూ.2.,20,592 కోట్లుగా నమోదయ్యింది. శుక్రవారం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ బిఎస్ఇలో 1.15 శాతం తగ్గి రూ.2,442.70 వద్ద ముగిసింది.

ఘనంగా ఎంఎస్ఎంఇ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)
సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఇ) ఎక్స్‌పో - 2023 విశాఖలోని గాజువాక ఆటోనగర్‌లో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజుల పాటు ఈ ఎక్స్‌పోను నిర్వహించనున్నారు. తొలిరోజు 52 స్టాళ్లను ఏర్పాటు చేసి ఉత్పత్తులను ప్రదర్శించారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కమర్షియల్ డైరెక్టర్ డికె.మహంతి మాట్లాడుతూ.. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ నిరంతరం అండగా ఉంటుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ రూ.3246 కోట్ల వ్యాపారం చేసిందని, అందులో రూ.60 కోట్ల వ్యాపారాన్ని స్థానిక చిన్న తరహా పరిశ్రమలు చేశాయని తెలిపారు.

ముమ్ముందూ తమ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐఈడిఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ జివిఆర్.నాయుడు, ఎస్‌బిఐ డిజిఎం మన్మయ పాండవ, హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీ జనరల్ మేనేజర్ పిశ్రీనివాస్, విశాఖ ఆటోనగర్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ అధ్యక్షులు బాలాజీ, కార్యదర్శి వినోద్, ఎపి ఛాంబర్ మాజీ అధ్యక్షులు జి.సాంబశివరావు పాల్గొన్నారు. మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యాన చేపట్టిన ఈ ఎక్స్‌పోలో కొలువుదీరిన ఉత్పత్తులు ఆకట్టుకున్నాయి. ఆర్ఐఎన్ఎల్, హెచ్‌పిసిఎల్, గెయిల్, బిడిఎల్, భెల్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఉత్పత్తులతోపాటు మాడుగుల హల్వానూ ప్రదర్శనలో ఉంచారు. పలు రకాల ఆహార ఉత్పత్తులు కొలువుదీరాయి.

సంపాదకీయం

మనువాదుల పాలనలో..

దేశంలో మహిళల భద్రత పెను ప్రమాదంలో పడింది. తల్లి గర్భం మొదలు శ్మశానం వరకు ఏ మూల కూడా మహిళ నిర్భయంగా బతికే పరిస్థితి లేదు. మారుమూల గ్రామాలు, పట్టణాలు, నగరాలు, పని ప్రదేశాలు, ఆసుపత్రులు, క్రీడా ప్రాంగణాలు..ఇలా అడుగడుగునా ఆడబిడ్డలు బిక్కుబిక్కుమంటూ బతుకు వెళ్లదీయాల్సిన దైన్య పరిస్థితులు నెలకొన్నాయంటే అతిశయోక్తి కాదు. దేశ రాజధాని నగరం ఢిల్లీ నడివీధుల్లో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మాలీవాల్‌నే వేధింపులకు గురిచేస్తూ కారులో ఈడ్చుకుంటూ వెళ్లిన ఘటన యావత్ భారతావనినే నివ్వెరపాటుకు గురిచేస్తోంది. దేశ రాజధాని నగరం, శాంతిభద్రతలు నేరుగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యవేక్షణలో ఉన్నచోట సాక్షాత్తూ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పరిస్థితి ఇంత భయానకంగా ఉంటే ఇక సాధారణ మహిళలకు ఏ పాటి రక్షణ ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. బిజెపి ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యుఎఫ్‌ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ఏళ్లతరబడి మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారన్న దారుణం వెలుగుచూసిన నేపథ్యంలో ఈ దాడి జరగడం గమనార్హం.

'బేటీ బచావో్..బేటీ పడావో..' వంటి ప్రచార్భాటపు నినాదాల మాటున మహిళలపై బరితెగించి ఆకృత్యాలకు ఒడిగడుతున్న బ్రిజ్ భూషణ్ లాంటి కాషాయ మూకలెందరో? ఒకరిద్దరు కాదు వందలాది మంది మహిళా రెజ్లర్లపై అతగాడు అఘాయిత్యాలకు ఒడిగట్టినట్టు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్దే మహిళా క్రీడాకారులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నా ప్రధానమంత్రి నరేంద్ర మోడీలో కానీ, బిజెపి అధినాయకత్వంలో కానీ ఇసుమంతైనా చలనం లేదు. మహిళా క్రీడాకారులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారంటూ మూడున్నర వారాల కిందట హర్యానా మంత్రి సందీప్ సింగ్‌పై ఆరోపణలు వస్తే ఆయనతో పదవికి రాజీనామా చేయించారు. ఆ ఘటన మరవక ముందే బిజెపి ఎంపీ బ్రిజ్‌పై ఆరోపణలు వచ్చినా..ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ఆందోళనలు సాగిస్తున్నా రాజీనామా ప్రస్తావనే లేకుండా నిస్సిగ్గుగా ఆయన ఎంపీగానూ, డబ్ల్యుఎఫ్‌ఐ అధ్యక్షుడిగానూ కొనసాగుతూనేవున్నాడు. స్వతహాగా క్రీడాకారుడైన కేంద్ర క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకుర్‌కు మహిళా రెజ్లర్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. కామాంధుల పట్ల మోడీ సర్కార్ ఎంతటి ఉదాసీన వైఖరి అవలంబిస్తోందో ఈ ఘటన ఉదాహరణగా నిలుస్తోంది. గుజరాత్ మత ఘర్షణల సమయంలో ముస్లిం మైనార్టీలపై ఆంబోతుల్లా అఘాయిత్యాలకు పాల్పడిన సంఘ్ పరివార్ గూండాల బాటలో నడిచే పాలకులున్న చోట ఇంతకంటే గొప్పగా ఊహించేదేముంటుంది? నాటి ఘాతుకాలను స్వయంగా అనుభవించి నేటికీ ఆ వేదనతోనే న్యాయం కోసం పోరాడుతున్న బిల్కిస్ బానో పట్ల మోడీ సర్కార్ ఎంత కక్షపూరితంగా వ్యవహరిస్తోందో చూశాం. హత్యలు చేసి, అఘాయిత్యాలకు పాల్పడి కఠిన కారాగార శిక్ష ఎదుర్కొంటున్న సంఘ్ పరివార్ గూండాలకు నిస్సిగ్గుగా ఇదే మోడీ సర్కార్ స్వేచ్ఛను ప్రసాదించించడం దేనికి సంకేతం? దుండగుల పట్ల మోడీ సర్కార్ అవలంబిస్తున్న ఈ మద్దతు ధోరణే దేశంలో ప్రత్యేకించి ఉత్తరప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్ తదితర బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలపై కామాంధులు ఇంతలా రెచ్చిపోవడానికి దోహదం చేస్తుందన్న విమర్శలకు తాజా పరిణామాలు బలం చేకూర్చుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వినాశకర సంస్కరణలకు ప్రయోగశాలగా మారిన మన రాష్ట్రంలోనూ మహిళల భద్రత ఎండమావులను తలపిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్)లో ఉన్నతోద్యోగులు తోటి ఉద్యోగుల పట్ల, మహిళా క్రీడా కారుల పట్ల లైంగిక వేధింపులకు తెగబడుతున్నారన్న కథనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. శాప్ వ్యవహారాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించడం స్వాగతించదగింది.

'దిశ', నిర్భయ వంటి చట్టాలు తీసుకొచ్చేశామని, హెల్ప్‌లైన్లు పెట్టేశామని ప్రచారాలతో సరిపెట్టడంతోనే మహిళలకు రక్షణ లభించదు. మహిళలను చులకన చేసే మనువాద భావజాలాన్ని, పితృస్వామ్య పెడధోరణులను తరిమికొడితేనే వారికి రక్ష.

మహనీయుల మాట



పుస్తకాలు ఎంత ముఖ్యమో, అంతకంటే పది రెట్లు మనిషి జీవితానుభవం ద్వారా నేర్చుకోగలుగుతాడు. విద్య పుస్తకాల వరకే పరిమితం కాక, నిత్య జీవితంతో సంబంధం కలిగి వుండాలి. అది జీవితాంతం విద్య కావాలి.

- గ్రుండ్ విగ్,
ఫోక్ హైస్కూల్ రూపకర్త

సందర్భం

సిద్ధాంత వారధి, తొలి విప్లవ సారథి లెనిన్

తెలకపల్లి రవి

మానవ చరిత్రను పరికిస్తే ఎందరో మహామహా వ్యక్తులు సాక్షాత్కరిస్తారు. యోధులు, మేధావులు, సిద్ధాంతకర్తలూ సామ్రాట్టులు కవులూ ఇలా. వ్లాదిమిర్ ఇల్యిచ్ ఉల్యనోవ్ అనే అసలు పేరు గల లెనిన్‌తో పోల్చదగిన వారు కొద్దిమంది కూడా వుండరు. నూరేళ్ల కిందట అస్తమించిన ఆ మహావ్యక్తి మార్క్స్ సిద్ధాంతాన్ని మరింత ఆధునీకరించడమేగాక అమలు చేసి తొలి విప్లవం తీసుకువచ్చిన ధీశాలి. మార్క్స్, ఎంగెల్సుల బోధలను తన కాలానికి అనుగుణంగా సంపన్నం చేయడమే గాక ప్రపంచపు తొలి సామ్యవాద దుర్గంగా సోవియట్ యూనియన్‌ను స్థాపించి, తొలిగండాల నుంచి దాన్ని కాపాడి శక్తిగా మలచిన వ్యూహకర్త. దోపిడీ రాజ్యాలకు ప్రత్యామ్నాయంగా శ్రామిక రాజ్యానికి అంకురార్పణ చేసిన అనితర సాధ్యుడు. మార్క్సిస్టు సిద్ధాంత సారాన్ని, చరిత్ర గమనాన్ని సవ్యంగా అర్థం చేసుకుని ఖచ్చితమైన సైద్ధాంతిక రాజకీయ వ్యూహాలు అనుసరించగలిగిన అగ్రగణ్యుడు. ఇల్యా నికోలావిచ్, మరియా అలెగ్జాండ్రియా బ్లాంక్ దంపతులకు 1870 ఏప్రిల్ 22న లెనిన్ జన్మించాడు. తండ్రి స్వయంకృషితో స్కూళ్ల డైరెక్టరుగా ఎదిగారు. తల్లి పిల్లలను ప్రేమగా తీర్చిదిద్దారు. లెనిన్ అన్నయ్య అలెగ్జాండర్ విద్యార్థిగా వున్నప్పుడే జార్ చక్రవర్తిపై హత్యా ప్రయత్నం చేసి ఉరికంబమెక్కాడు. అన్నను ఎంతో ప్రేమించే లెనిన్ అన్న సాహసాన్ని స్మరిస్తూనే ఆ మార్గం సరైంది కాదని తెలుసుకున్నాడు. కజాన్ యూనివర్సిటీలో చదువుతున్నప్పుడే ప్రగతిశీల ఉద్యమాలతో సంబంధం పెరిగింది. మార్క్సిస్టు సాహిత్యంతో పరిచయమేర్పడింది. అప్పటికి రష్యాలో ఆ సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్న ప్లెఖనోవ్ వంటివారి లోపాలు కూడా తెలుసుకోగలిగాడు. కజాన్‌లో విద్యార్థిగా పోరాడుతున్నప్పుడే ఒక పోలీసు అధికారి 'నీవు గోడను ఢీకొంటున్నావు' అంటే 'కానీ అది కూలిపోవడానికి సిద్ధంగా వున్న గోడ' అని ధైర్యంగా జవాబిచ్చిన ధైర్యశాలి.

పందొమ్మిదవ శతాబ్దం చివరి నాటికి పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి అత్యున్నత దశకు చేరింది. ఆ వ్యవస్థ అనేక నూతన లక్షణాలు సంతరించుకుంది. 'సామ్రాజ్యవాదం-పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ' (1916) అనే తన మహత్తర గ్రంథంలో లెనిన్ తొలిసారిగా ఈ లక్షణాలను క్రోడీకరించాడు. ఈ దశలో పెట్టుబడిదారీ విధానం గుత్త స్వభావం సంతరించుకుంటుంది. దేశాల ఆర్థిక వ్యవస్థల్లో గుత్త సంస్థలే కీలక పాత్ర వహిస్తాయి. శతాబ్ది చివరికి అమెరికా చమురు వ్యాపారంలో 90 శాతం రాక్‌ఫెల్లర్ చేతుల్లో వుంది. మోర్గాన్‌కు చెందిన స్టీల్ కార్పొరేషన్ మూడింట రెండు వంతులు ఉక్కు పరిశ్రమపై అదుపు కలిగివుంది. గుత్తాధిపత్యం సామ్రాజ్యవాద దశ మొదటి లక్షణం. సరుకుల ఎగుమతి బదులు పెట్టుబడి ఎగుమతి రెండో లక్షణం. 1914 నాటికి బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీల విదేశీ పెట్టుబడులు 2000 కోట్ల ఫ్రాంకుల వరకు వున్నాయి. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కలగలసిన ఫైనాన్స్ పెట్టుబడి ప్రాబల్యం పెరగడం మూడో లక్షణం. నాలుగో లక్షణం వివిధ దేశాల గుత్తసంస్థలు చేతులు కలిపి గొలుసుకట్టుగా ఏర్పడ్డం చివరి లక్షణం ఈ క్రమంలో అగ్రస్థాయి పెట్టుబడిదారీ దేశాలు ప్రపంచ భూభాగాన్ని తమ మధ్య పంచుకోవడం ఆ పంపకాలలో వాటాలు పెంచుకోవడానికి పునర్విభజనకు యుద్ధాలు సృష్టించడం. ఇవీ లెనిన్ వివరించిన అంశాలు. వీటి ఆధారంగా తమ దేశంలో కర్తవ్యాలను వాటిని సాధించే రాజకీయ శక్తిగా కార్మికవర్గ పార్టీని ఆయన అంకురార్పణ చేశాడు. ఇరవయ్యవ శతాబ్ది ప్రారంభంలోనే రష్యా ప్రపంచ విప్లవ శక్తులకు ప్రధాన ప్రేరణ అయింది. 1898లో రష్యన్ సోషల్ డెమొక్రటిక్ పార్టీ ఏర్పడింది. 1900లో తొలి విప్లవ పత్రిక 'ఇస్క్రా' ప్రచురణ ప్రారంభమైంది. 1903లో పార్టీ రెండవ మహాసభలో పార్టీ నాయకత్వానికి జరిగిన ఎన్నికలలో లెనిన్ భావాలను బలపరచేవారు అధికంగా ఎన్నికైనారు. తప్పుడు సిద్ధాంతాలను బోధించేవారు ఓడిపోయారు. వీళ్లనే బోల్షివిక్ (మెజారిటీ), మెన్షివిక్ (మైనారిటీ) అన్నారు. ఈ మహాసభ జార్ చక్రవర్తి కూల్చివేతతో సహా ప్రపంచంలో తొలి విప్లవాత్మక కార్యక్రమాన్ని ఆమోదించింది.

తొలి రిహార్సల్‌పై పాఠాలు

1905 జనవరిలో సెయింట్ పీటర్స్‌బర్గ్ కార్మికులు సమ్మె చేశారు. జార్జి గపన్ అనే క్రైస్తవ మతగురువు బోధనలతో జనవరి 9 ఆదివారం నాడు లక్షన్నర మంది కార్మికులు జార్ నివసించే వింటర్ ప్యాలెస్‌కు ప్రదర్శనగా వెళ్ళారు. జార్ రెండవ నికోలస్ సైన్యం ఇష్టానుసారం జరిపిన కాల్పులలో వెయ్యి మంది అక్కడికక్కడే చనిపోయారు. అదే 'రక్తసిక్త ఆదివారం'గా మిగిలిపోయింది. జార్ చక్రవర్తి పైన, ప్రభువుల కరుణపైన భ్రమలు పటాపంచలయ్యాయి. జూన్ నెలలో యుద్ధనౌక "పొటెంకిన్" లోని నావికా సిబ్బంది తిరుగుబాటు చేశారు. వారిని అణచేందుకు పంపిన సైనికులు కూడా కాల్పులు జరిపేందుకు నిరాకరించారు. 1905 డిసెంబర్‌లో కార్మికులు సాయుధ తిరుగుబాటు చేయగా అది విఫలమైంది. అయినా ఎన్నో గుణపాఠాలు నేర్పింది. ముఖ్యంగా కార్మికులలో ఐక్యత అవసరాన్ని చెప్పింది. "1905 డ్రెస్ రిహార్సల్ లేకపోతే 1917 అక్టోబర్ విప్లవం అసాధ్యమై వుండేది" అని లెనిన్ అన్నాడు. 20వ శతాబ్ది ప్రారంభం నాటికే వలసల కోసం అగ్రరాజ్యాల మధ్య ఘర్షణలు పరాకాష్టకు చేరుకున్నాయి. 1914 ఆగస్టు 1న మొదటి ప్రపంచ యుద్ధం ప్రజ్వరిల్లింది. అవకాశవాద కార్మిక నేతలు తమ తమ దేశాలలో పాలకులను బలపర్చే విధానం తీసుకున్నారు.

1914లో నెదర్లాండ్స్‌లో వున్న లెనిన్ కార్మికోద్యమానికి నూతన విప్లవ కార్యక్రమాన్ని ప్రతిపాదించాడు. ఇది సామ్రాజ్యవాద యుద్ధమంటూ అవకాశవాద పోకడలను ఖండించాడు. సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చాలని పిలుపునిచ్చారు. ఆర్థిక, రాజకీయ అభివృద్ధిలో వేర్వేరు దేశాలు వేర్వేరు దశల్లో ఉన్నందువల్ల అన్ని చోట్లా ఒకేసారి సోషలిస్టు విప్లవం రావడం సాధ్యం కాదని చెప్పారు. పెట్టుబడిదారీ గొలుసులో బలహీనంగా వున్న లింకును తెంచవచ్చునన్నాడు. ఈ పోరాటంలో కార్మికవర్గం కొత్త మిత్రులను కూడగట్టుకోవాలి. రైతాంగం అప్పటికే మిత్రపక్షంగా మారిపోయింది. ఇక వలస దేశాల ప్రజలు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిపే పోరాటంతో కార్మికవర్గం భుజం కలపడం అవసరమని ఆయన ఉద్బోధించారు. ఉద్యమాభివృద్ధికి పత్రిక, పార్టీ పటిష్టతకు కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాలు అవసరమని నొక్కి చెప్పారు. అతివాద దుస్సాహసిక చర్యలను సరికాదని స్పష్టం చేస్తూ ప్రజలతో పాటు నడిచారు.

మిగిలిన దేశాలతో పోలిస్తే యుద్ధానికి అంతగా సిద్ధంగాని రష్యాలో రాజకీయ, ఆర్థిక సంక్షోభాలు తలెత్తాయి. ఆహార కొరత తీవ్రంగా ఉంది. 1917 నాటికి ప్రజల అసంతృప్తి తీవ్ర స్థాయికి చేరింది. ఆ జనవరిలో లక్షలాది మంది కార్మికులు అనేక సమ్మెలు చేశారు. ప్రజలు అంతకంతకు వెల్లువగా కదిలారు. మార్చి 12 నాటికి పెట్రోగ్రాడ్ తిరుగుబాటుదారుల స్వాధీనమైంది. మార్చి 15న ఒక తాత్కాలిక ప్రభుత్వమేర్పడింది. ఆ ప్రభుత్వంలో వామపక్ష పదజాలం వాడే కెరెన్‌స్కీ అనే ఒకే ఒక్క బూటక 'ప్రజాతంత్ర'వాది చోటు సంపాదించాడు. ఆ రోజునే రైల్వే కార్మికులు జార్ రైలును నిలిపివేసి అధికారం వదులుకుంటున్నట్లు సంతకం చేయించారు. ఆవిధంగా జార్ నిరంకుశ పాలన సమాప్తమైంది.



లెనిన్ 99వ వర్ధంతి నేడు

లెనిన్ చెప్పినట్లు యుద్ధం అంతర్యుద్ధంగా మార్చబడింది. రష్యాలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. వివిధ స్థాయిలలో కార్మిక, కర్షక ప్రతినిధులతో సోవియట్లు అనేవి ఏర్పడ్డాయి. 1917 ఏప్రిల్‌లో స్వదేశం చేరిన లెనిన్ 'సర్వాధికారాలు సోవియట్లకే! తాత్కాలిక ప్రభుత్వానికి మద్దతు లేదు' అని నినాదమిచ్చారు.

విప్లవ విజయం

అక్టోబర్ 25, 26 తేదీల (కొత్త తేదీ నవంబర్ 7) మధ్య తెల్లవారుతుండగా సైనికులు, నావికులు, చక్రవర్తుల నివాస భవనమైన వింటర్ ప్యాలెస్‌ను స్వాధీనం చేసుకున్నారు. తాత్కాలిక ప్రభుత్వ ప్రతినిధులను బందీలుగా పట్టుకున్నారు. మరో మూడు గంటల తర్వాత కార్మిక, కర్షక సోవియట్ల మహాసభ రష్యాను సోవియట్ సోషలిస్టు రిపబ్లిక్‌గా ప్రకటించింది. రాజ్యాధికారం ప్రజల హస్తగతమైంది. మానవాళి చరిత్ర మహత్తరమైన మలుపు తిరిగింది. జార్ చక్రవర్తి కూల్చివేత అనంతరం కూడా లెనిన్ ఓపికతో అనేక వ్యూహాలు అనుసరించారు. అయితే తాత్కాలిక ప్రభుత్వం చేతుల్లోంచి సోవియట్లకు అధికారం బదలాయించేందుకు జరిగిన అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాకే విప్లవం అవసరమైంది. దానిపై పెట్టుకున్న ఆశలు వమ్మయినందువల్లనే ప్రజలు విప్లవాన్ని సంపూర్ణంగా బలపరిచారు. నవంబర్ 7న 2 కోట్ల మంది ఓటర్లకు ప్రాతినిధ్యం వహించే సోవియట్ల ప్రతినిధులు లెనిన్ నాయకత్వాన నూతన ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. సోవియట్ ప్రభుత్వం మొదటగా శాంతి కోసం విజ్ఞప్తి డిక్రీ ఆమోదించింది. భూస్వాములకు, చర్చిలకు సంబంధించిన పొలాలను, పశుసంపదను ఎలాంటి పరిహారం లేకుండా స్వాధీనం చేసుకునే మరో డిక్రీ, 8 గంటల పనిదినంపై ఇంకో డిక్రీ ఆమోదించింది.

సోవియట్ రష్యా విప్లవ విజయానంతరం కూడా అనేక అగ్నిపరీక్షలను ఎదుర్కోవలసి వచ్చింది. కూలిపోయిన కెరెన్‌స్కీ ప్రభుత్వం విప్లవ వ్యతిరేక ప్రతీఘాత శక్తులను ఎగదోసింది. వైట్ గార్డులనే పేరిట వారు గ్రామాల్లో చేరి తీవ్ర బీభత్సకాండ సృష్టించారు. వాటన్నిటి మధ్యనా లెనిన్ ఎంతో చాకచక్యంగానూ ఆర్థికాభివృద్ధికి నిర్దిష్ట ప్రణాళిక రూపొందించాడు. 1918 జులైలో సోవియట్ తొలి రాజ్యాంగం రూపొందింది. 1918 మార్చిలో ఫ్రెంచి, బ్రిటిష్, అమెరికన్ సేనలు రష్యాలో దిగాయి. ఏప్రిల్ 4,8 తేదీలలో జపాన్, అమెరికా సేనలు కూడా ప్రవేశించాయి. ఈ పరిస్థితులలో విప్లవాన్ని సంరక్షించుకునేందుకై కమ్యూనిస్టు పార్టీ పిలుపు మేరకు రష్యాలోని కార్మికులు, రైతులు ఆయుధాలు చేబట్టి కదిలారు. స్వల్ప వ్యవధిలోనే 50 లక్షల మందికి పైగా ఎర్రసైన్యంలో చేరారు. "అన్నీ యుద్ధ రంగానికే. అంతా విజయానికే" అని కమ్యూనిస్టు పార్టీ ఇచ్చిన నినాదంతో ప్రజలు పోరాడారు. శౌర్య ప్రతాపాలతో త్యాగాలతో పోరాడి అంతర్గత, బాహ్య శత్రు శక్తులను ఓడించగలిగారు.

అహరహం మార్గదర్శి


తర్వాత సోషలిజం నిర్మాణంలో సాగిన అంతర్యుద్ధాలు, బయిటి యుద్ధాలు ఇదంతా మరో అధ్యాయం. తమ దేశంతోనే ఆగక లెనిన్ ఇండియాతో సహా దేశదేశాల కార్మిక వర్గ పోరాటాలకు ఊతమిచ్చాడు. ప్రాచ్య దేశాల విశ్వవిద్యాలయంలో భారతీయ విప్లవకారులకు కూడా తర్ఫీదునిచ్చాడు. లెనిన్ శ్రామికవర్గ అంతర్జాతీయతను అమలు చేసిన ప్రపంచ నాయకుడు. తర్వాత స్టాలిన్ ఆ స్థానంలో నాయకత్వం చేపట్టాడు. ఒక వామపక్ష తీవ్రవాద యువతి హత్యాప్రయత్నం కారణంగా లెనిన్ తీవ్రంగా గాయపడినా...అక్కడ కూడా అధ్యయనం కొనసాగించాడు. దానివల్ల అలసిపోతున్నారని స్టాలిన్ కోప్పడితే డాక్టర్ల షరతులు పాటించబోనని ఆయన సరదాగా పోట్లాడేవాడు. విప్లవోద్యమ సహచరులకు వైద్య సహాయం తదితర అంశాలపై నాయకత్వానికి తరచూ లేఖలు రాసేవాడు. చివరకు 1924 జనవరి 21 లెనిన్ కన్నుమూశాడు. అప్పటి నుంచి అది 'లెనిన్ డే' అయింది. ఆయన సతీమణి కృపస్కయా కూడా మొదటి నుంచి విప్లవోద్యమ నాయకత్వంలో ఆయనతోపాటు నడవడమేగాక ఆయన మరణానంతరం కూడా సోవియట్ మంత్రిగా కొనసాగారు.

విప్లవ విజయానికి దాన్ని కాపాడుకోవడానికి ప్రపంచంలో భిన్న వర్గాల, రాజ్యాల బలాబలాలు సరైన రీతిలో అంచనా కట్టి తగు ఎత్తుగడలు అనుసరించడానికి లెనిన్ జీవితమే ఒక ఉదాహరణగా నిలిచిపోయింది. ఆయన బహుముఖ ప్రజ్ఞ, అపార అధ్యయనం, నిశితమైన సైద్ధాంతిక రచనలు మరెవరితోనూ పోల్చలేనివి. ప్రజలకే అధికారం అందించడం, వారితో మమేకం కావడం ఆయన ప్రధాన సూత్రం. గోర్బచేవ్ వంటి వారి కారణంగా విచ్చిన్న చర్యలు మొదలైనాక మొదట శత్రువులు లెనిన్ విగ్రహాలనే కూల్చడం యాదృచ్ఛికం కాదు. కానీ వారు లెనిన్ వారసత్వాన్ని ఎప్పటికీ కూల్చలేకపోయారు. 1991 ఆగస్టులో సోవియట్ విచ్చిన్నత వరకూ దారితీసిన పరిణామాలపై అనేక గుణపాఠాలు, చారిత్రిక సమీక్షలు వెలువడ్డాయి. అవేమైనా లెనినిజం నుంచి పక్కకు తొలగిన పర్యవసానాలు తప్ప మార్క్సిజం, లెనినిజం మౌలికతను వమ్ము చేసేవి కావవి. మా తప్పులను ఆత్మ విమర్శ చేసుకుంటే శత్రువులు నవ్వొచ్చు గాని మేము మాత్రం అది అవసరమనే భావిస్తాం. తప్పులు జరిగితే దిద్దుకుంటాం...అని ఒకటికి నాలుగు సార్లు ఢంకా బజాయించి చెప్పిన లెనిన్ స్ఫూర్తి ఈనాడు మనకు మరింత అవసరం. అవకాశవాద పోకడలపై పోరాటం, ఆశయాల పట్ల అవగాహన ఆచరణలో అప్రమత్తత ఇదే లెనిన్ మార్గం. నేటి పరిస్థితులలో సవాళ్లలో అనేకం మనకు లెనిన్ రచనల్లో యథాతథంగా కనిపిస్తాయి. ఎందుకంటే శ్రీశ్రీ అన్నట్టు ప్రపంచమనే కావ్యానికి ప్రతిపదార్థం లెనిన్. ఈ 99వ వర్ధంతి రోజున ఆయనకదే మరోసారి నివాళి.

★

విశ్లేషణ

గవర్నర్ ప్రసంగం - రాజ్యాంగ ప్రాధాన్యత



పి.డి.టి. ఆచారి

ఈనెల 9వ తేదీన తమిళనాడు అసెంబ్లీలో శాసనసభ్యులను ఉద్దేశించి సాంప్రదాయంగా చేయాల్సిన తన మొదటి ప్రసంగ పాఠంలో గవర్నర్ ముఖ్యమైన, రాజ్యాంగ ప్రాధాన్యతగల ఒక పేరాను చదవకుండా దాటేయడంతో వివాదం చెలరేగింది. ఆ పేరా తమిళనాడులో రాజకీయ, సాంస్కృతిక ప్రాధాన్యతగల ద్రవిడ నమూనా పాలనను సూచించింది. ప్రస్తుత గవర్నర్‌కు, ద్రవిడ నమూనా పాలన లేదా రాజకీయ లేదా దాని గత సాంస్కృతిక భావనకు ఎలాంటి భావోద్వేగపూరితమైన సంబంధం లేదు. అది ఆయన ఉపన్యాసాలు, పరిశీలనల ద్వారా స్పష్టంగా అర్థవుతుంది. ఇక్కడ సమస్య, ఒక ప్రత్యేకమైన రాజకీయ భావజాలం లేదా సాంస్కృతిక సాంప్రదాయం పట్ల గవర్నర్ ఇష్టాయిష్టాల గురించి కాదు కానీ...రాజ్యాంగ అధికారం తన రాజ్యాంగ సంబంధిత బాధ్యతల్ని నిర్వర్తించే క్రమంలో బాగా స్థిరపడిపోయిన, తప్పనిసరిగా పాటించాల్సిన రాజ్యాంగబద్ధమైన ఆచరణలను ఉల్లంఘిస్తుందా అన్నదే సమస్య.

> **ఆర్టికల్ 176 ప్రకారం గవర్నర్ చేసే ప్రసంగం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన ప్రసంగం అనే విషయం భారత రాజ్యాంగ వ్యవస్థ గురించి ఎరిగిన వారెవరికైనా తెలిసిన విషయమే. ఆ ప్రసంగంలో గవర్నర్ వ్యక్తిగతమైన అంశాలకు తావులేకుండా కేవలం ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు మాత్రమే ఉంటాయి. ఆ ప్రసంగానికి ప్రభుత్వమే బాధ్యత వహిస్తుందిగానీ, గవర్నర్ బాధ్యత వహించరు. గవర్నర్ తన స్వంతంగా ఒక్క పదాన్ని కూడా మార్చకూడదు. కాబట్టి, ప్రసంగ పాఠంలోని కొన్ని భాగాలను ఉద్దేశ్యపూర్వకంగానే చదవకుండా గవర్నర్ ఆర్టికల్ 176కు విరుద్ధంగా వ్యవహరించారు.**



పూర్తి ప్రసంగం...

రాజ్యాంగం లోని ఆర్టికల్ 176 ప్రకారం, ప్రతి సంవత్సరం శాసనసభ మొదటి సమావేశాన్ని పురస్కరించుకుని శాసనసభ్యులను ఉద్దేశించి గవర్నర్ తప్పకుండా ప్రసంగించి, సమావేశ పిలుపునకు గల కారణాలను వారికి తెలియజేయాలి. ఈ ప్రసంగంలో సూచించబడిన అంశాలను శాసనసభ చర్చించాలని రెండవ నిబంధన చెపుతుంది. ఇక్కడ "ప్రసంగం" అంటే పూర్తి ప్రసంగం. దాటవేయగా పోను మిగిలిన భాగం కాదు. అందువలన, శాసనసభ్యుల ముందు గవర్నర్ చదివేదే పూర్తి ప్రసంగం. దానిలో పేర్కొన్న అంశాలు మొత్తం సభలో సభ్యులందరూ తప్పకుండా చర్చించాలి.

ఇక్కడ, గవర్నర్ ప్రసంగంలోని అంశాలు మొత్తం చర్చించడానికి తగిన సమయం కలిగి ఉండే విధంగా మన రాజ్యాంగం శాసనసభకు నిర్దిష్టమైన మార్గదర్శకాలను జారీ చేస్తుంది. ఆర్టికల్ 176 ప్రకారం, గవర్నర్ ప్రసంగం కాకుండా వేరే ఇతర నిర్దిష్టమైన అంశాలను చర్చించడానికి అవసరమైన సమయం కోసం నిబంధనలు రూపొందించాలని రాజ్యాంగం ఎక్కడా చెప్పకపోయిన అంశం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. గవర్నర్ ప్రసంగానికి ఉండే అలాంటి ప్రాధాన్యతను రాజ్యాంగం నొక్కి చెప్తుంది.

గవర్నర్ శాసనసభను ఉద్దేశించి ప్రసంగించేందుకు శాసనసభ్యులు హాజరు కావాలని కోరవచ్చని చెప్పే ఆర్టికల్ 175ను పరిగణ లోకి తీసుకుంటే మనకు ఇంకా స్పష్టమవుతుంది. ఆర్టికల్ 175 ప్రకారం తన ప్రసంగానికి హాజరు కావాలని గవర్నర్ కోరే అంశం, ఆర్టికల్ 176 వలె సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాల్సిన అంశం కాదు. ఆర్టికల్ 175 ప్రసంగం లోని అంశాలను చర్చించాల్సిన అవసరం లేదు కానీ, ఆర్టికల్ 176 ప్రకారం గవర్నర్ చేసిన ప్రసంగంలోని అంశాలపై ఖచ్చితంగా సభలో చర్చ జరగాలి. ఒకే రాజ్యాంగం ప్రకారం జరిగే రెండు ప్రసంగాల మధ్య ఉండే తేడాను మన రాజ్యాంగం కలిగి ఉండడం వెనుక ఉన్న కారణం ఏమంటే ఆర్టికల్ 176 ప్రకారం చేసే ప్రసంగంలో శాసనసభకు జవాబుదారీగా ఉండే ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, దాని కార్యక్రమాల గురించి ఉంటాయి. ఎన్నిక కాబడిన ప్రజాప్రతినిధులకు కార్యనిర్వాహక వర్గం జవాబుదారీగా ఉండడం అనేది పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ముఖ్య సారం.

కాబట్టి, ప్రతి సంవత్సరం జరిగే శాసనసభ మొదటి సమావేశంలో శాసన సభ్యులను ఉద్దేశించి గవర్నర్ తప్పకుండా చేసే ప్రసంగం ద్వారా ప్రభుత్వం, ఆ సంవత్సరం తలపెట్టే ప్రధానమైన శాసనసభా కార్యక్రమాలు, గత సంవత్సరం తమ ప్రభుత్వం సాధించిన విజయాలు, భవిష్యత్తు అభివృద్ధి కార్యక్రమాల రూపురేఖల వివరాలను తెలియజేస్తుంది. ప్రభుత్వం తన కార్యక్రమాలు, విధానాలను గవర్నర్ ద్వారా శాసనసభకు తెలియజేస్తుంది. ఆ విధంగా ఆర్టికల్ 176 అంత ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది.

గవర్నర్ ప్రసంగానికి రాజ్యాంగం అంతటి ప్రాధాన్యత ఇస్తుంటే గవర్నర్ దానిని తిరస్కరిస్తూ...ప్రసంగ పాఠంలోని కొన్ని భాగాలను చదవకుండా దాటేసి, తన స్వంత అభిప్రాయాలను జోడించవచ్చా?

ప్రసంగంలోని పేరాలను దాటేయడం అంటే గవర్నర్ ప్రభుత్వ ఆలోచనలను, భావనలను ఆమోదించడం లేదని అర్థం. ఆర్టికల్ 176 ప్రకారం గవర్నర్ చేసే ప్రసంగం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం తయారు చేసిన ప్రసంగం అనే విషయం భారత రాజ్యాంగ వ్యవస్థ గురించి ఎరిగిన వారెవరికైనా తెలిసిన విషయమే. ఆ ప్రసంగంలో గవర్నర్ వ్యక్తిగతమైన అంశాలకు తావులేకుండా కేవలం పభుత్వ విధానాలు, కార్యక్రమాలు మాత్రమే ఉంటాయి. ఆ ప్రసంగానికి ప్రభుత్వమే బాధ్యత వహిస్తుందిగానీ, గవర్నర్ బాధ్యత వహించరు. గవర్నర్ తన స్వంతంగా ఒక్క పదాన్ని కూడా మార్చకూడదు. కాబట్టి, ప్రసంగ పాఠంలోని కొన్ని భాగాలను ఉద్దేశ్యపూర్వకంగానే చదవకుండా గవర్నర్ ఆర్టికల్ 176కు విరుద్ధంగా వ్యవహరించారు. శాసనసభ్యులు సృష్టించే అలజడి, గందరగోళం కారణంగా గవర్నర్ ప్రసంగ పాఠాన్ని పూర్తిగా చదవలేక పోవడం వేరు. ప్రసంగంలో పేర్కొన్న అంశాలను విభేదించి, తన వ్యక్తిగత అభిప్రాయాలను చేర్చేందుకు రాజ్యాంగం గవర్నర్‌ను అనుమతించదు కాబట్టి ఆయన ప్రసంగంలోని కొన్ని భాగాలను ఉద్దేశ్యపూర్వకంగా దాటేయకూడదు.

కొన్ని ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లో గవర్నర్ల చర్యలు తరచుగా విమర్శలకు గురవుతున్నాయి. రాష్ట్ర శాసనసభ తీర్మానించిన బిల్లును ఎటూ తేల్చకుండా తొక్కి పట్టడం, రాజ్యాంగం కల్పించిన ఎంపికల (ఆప్షన్స్)పై ఎలాంటి కసరత్తు చేయకపోవడం, మొత్తం శాసనసభ కసరత్తును నిలిపివేయడం అనేది రాజ్యాంగ ఉల్లంఘనే అని స్పష్టం అవుతుంది. రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసిన బిల్లులను తొక్కిపట్టే అనుమతిని రాజ్యాంగం గవర్నర్‌కు కల్పించలేదు. బిల్లుల ఆమోదం కోసం గవర్నర్లకు ఎలాంటి కాలపరిమితిని నిర్దేశించకపోవడం వల్ల ఆర్టికల్ 200లో ఉన్న ఏ ఎంపికలను పరిగణలోకి తీసుకోకుండా బిల్లును తొక్కి పట్టవచ్చనే భావనలో ఉన్నట్లు కనిపిస్తుంది. ఇది రాజ్యాంగ నిబంధనలను తప్పుగా అర్థం చేసుకోవడమే అవుతుంది. ఆర్టికల్ 200 ప్రకారం, గవర్నర్ బిల్లుకు ఆమోదం తెలుపవచ్చు. లేదా ఆమోదాన్ని నిలిపివేయవచ్చు. లేదా బిల్లును వెనక్కి తిప్పి పంపవచ్చు. తిప్పి పంపించబడిన బిల్లును ఎలాంటి మార్పులు చేయకుండా మళ్ళీ అసెంబ్లీ తీర్మానం చేస్తే గవర్నర్ ఆ బిల్లును ఆమోదించాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతి పరిశీలన కోసం కూడా పంపవచ్చు. ఆ విధంగా, గవర్నర్ బిల్లులను తొక్కిపట్టి, అసెంబ్లీ చేసే శాసనాల కసరత్తును నిలిపివేయకూడదని ఆర్టికల్ 200 స్పష్టంగా తెలియజేస్తుంది. బ్రిటన్‌లో పార్లమెంటు తీర్మానించిన బిల్లుల ఆమోదాన్ని నిలిపి ఉంచడం రాజ్యాంగ విరుద్ధమైన చర్య.

ఇప్పుడొక బహిరంగ సవాల్ ...

రాజ్యాంగ స్థానాలను ప్రశ్నించడానికి, సవాల్ చేయడానికి చేసిన ప్రయత్నాల కారణంగానే ఈ సమస్యలన్నీ ఉత్పన్నం అవుతున్నాయి. గవర్నర్లు అకస్మాత్తుగా ముఖ్యమంత్రులను, రాష్ట్ర ప్రభుత్వాలను విమర్శించడం మొదలుపెట్టారు. కొందరు గవర్నర్లు ఆఖరికి ముఖ్యమంత్రులపై దాడి చేయడానికి ప్రెస్ కాన్ఫరెన్స్‌లు కూడా నిర్వహిస్తున్నారు. గవర్నర్లకు సంబంధించిన అసంతృప్తి బహిరంగంగా వ్యక్తం అవుతుంది. ఏ నిర్ణయాలు చేయక రాజ్‌భవన్ లలో బిల్లులు కుప్పలు కుప్పలుగా పేరుకొని పోతున్నాయి. షంషేర్ సింగ్ (1974) నుండి నబమ్ రిబియా (2016) వరకు, గవర్నర్లు కేవలం మంత్రిమండలి సలహా సంప్రదింపులపై మాత్రమే తమ బాధ్యతలు నిర్వహించాలని, ఎన్నికైన ప్రభుత్వాన్ని లక్ష్యపెట్టకుండా స్వతంత్రంగా ఎలాంటి కార్యనిర్వాహక అధికారాలను చెలాయించలేరని సుప్రీంకోర్టు పేర్కొంది. "...ఇలా నియమించబడిన వ్యక్తి రాష్ట్ర శాసనసభలను ఏర్పాటు చేసిన ప్రజాప్రతినిధులపై, ముఖ్యమంత్రి నాయకత్వం వహించే మంత్రి మండలి కింద పని చేసే ప్రభుత్వ కార్యనిర్వాహక వర్గంపై అధికారాన్ని చెలాయించ కూడద"ని నబమ్ రిబియా కేసులో కోర్టు పేర్కొంది. మనం అనుకుంటున్న విధంగా, రాజ్యాంగం సూత్రబద్ధంగానే ఉండాలని భావిస్తే... పూర్తిగా రాజ్యాంగబద్ధమైన గవర్నర్‌గా రాష్ట్రాల పాలనాపరమైన విషయాల్లో జోక్యం చేసుకునే ఎలాంటి అధికారం లేదని బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగ పరిషత్‌లో అన్నారు. మంత్రి మండలి సలహాకు వ్యతిరేకంగా వెళ్లేవిధంగా గవర్నర్లను అనుమతించడం ద్వారా రాష్ట్రంలో ఒక సమాంతర పాలనను సమకూర్చే లక్ష్యం మన రాజ్యాంగానికి లేదని-షంషేర్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మన వ్యవస్థ యొక్క సమగ్రతను కాపాడాలనుకుంటే ఇలాంటి వివేకవంతమైన వ్యాఖ్యానాలను ఆలకించాలి. రాజ్యాంగ అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా హద్దులు దాటి, వ్యవస్థను దెబ్బ తీయాలని అనుకుంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుంది.

(వ్యాసకర్త : లోక్ సభ మాజీ సెక్రటరీ జనరల్)
("ద హిందూ" సౌజన్యంతో)



సిఐటియు మహాసభకు హాజరైన ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు



ఎలమరం కరీంతో మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు



ఎవి నాగేశ్వరరావు

ప్రత్యామ్నాయం కోసమే పోరాటం

రైతులు, కార్మికులు ఏకం కావాలి

సిఐటియు మహాసభలో ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్



ప్రజాశక్తి -శ్యామల్ చక్రవర్తి నగర్ నుంచి ప్రత్యేక ప్రతినిధి

ప్రజలపై భారాలను మోపి, వారిని కష్టాల పాల్జేస్తున్న పెట్టుబడిదారీ దోపిడి విధానాలకు వ్యతిరేకంగా ప్రత్యమ్యాయాన్ని నిర్మించడమే లక్ష్యంగా పోరాటాలను నిర్మించాలనిఅఖిల భారత కిసాన్‌సభ(ఎఐకెఎస్) ప్రధాన కార్యదర్శి విజ్జూ కృష్ణన్ పేర్కొన్నారు. బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లోని శ్యామల్ చక్రవర్తి నగర్‌లో జరుగుతున్న సిఐటియు 17వ అఖిల భారత మహాసభకు ఆయన హాజరై శుక్రవారం సౌహార్థ సందేశామిచ్చారు. పెట్టుబడిదారీ విధానంలోనే లోపముందని, దానికి సంక్షభాలు తప్పవని తెలిపారు. ప్రపంచంలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలే దీనికి నిదర్శనమని అన్నారు. కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలంటే రైతులు, కార్మికులు ఐక్యంగా పోరాటం సాగించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఇది మూడు వ్యవసాయ నల్ల చట్టాల రద్దు సమయంలో రుజువైందని గుర్తు చేశారు. రైతులు, కార్మికులు ఐక్యంగా పోరాటంలో దిగితే పాలకులకు పతనం తప్పదన్నది చరిత్ర చెబుతున్న వాస్తవమని పేర్కొన్నారు. దేశంలో ఆర్థిక సంక్షోభం తీవ్రతరమైందని తెలిపారు. నిరుద్యోగం గతంలో ఎన్నడూలేనంతగా పెరిగిందని పేర్కొన్నారు. దినసరి కూలీలు రెండున్నర లక్షల మంది ఈ ఎనిమిదేళ్లలో ఆత్మహత్యలకు పాల్పడ్డారని విచారం వ్యక్తం చేశారు. రైతులు 1995 నుంచి ఇప్పటి వరకు నాలుగు లక్షల మంది ఆత్మహత్యలకు పాల్పడితే ఈ ఎనిమిదేళ్లలో లక్ష మంది రైతులు బలవన్మరణం చెందారని తెలిపారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరడాల్సిన అవసరముందన్నారు. మరోవైపు ఎఫ్‌సిఐ, ట్రాన్స్‌పోర్టు, విద్యుత్, ఫర్టిలైజర్స్ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నారని గుర్తు చేశారు.

ఈ రంగాలు దెబ్బతింటే ఈ ప్రభావం రైతులపైనా ఉంటుందని పేర్కొన్నారు. అందుకే ఈ పాలకుల విధానాలకు వ్యతిరేకంగా రైతులు, కార్మికులు ఏకమై పోరాటాలకు సిద్ధపడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. 'కిసాన్..మజ్దూర్ ఏక్తా' అన్నది ఒక నినాదం కాకూడదని, ఇది క్షేత్రస్థాయి వరకు వెళ్లి అందరినీ కదిలించాలని పిలుపునిచ్చారు. అందుకు సిఐటియు జాతీయ మహాసభ వేదికవ్వాలని ఆకాంక్షించారు.

క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి : ఎ.విజయరాఘవన్

క్షేత్రస్థాయిలోకి ప్రత్యామ్నాయ విధానాలను తీసుకు వెళ్లాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు ఎ.విజయరాఘవన్ అన్నారు సౌహార్ధక సందేశమిస్తూ కార్పొరేట్, కమ్యూనల్ ఎజెండాతో ముందుకెళ్తున బిజెపి విధానాలను తిప్పికొట్టాలన్నారు. ఐక్యపోరాటాలకు ఏప్రిల్ 5వ తేదీన జరిగే ఛలోఢిల్లీ కార్యక్రమం తొలిమెట్టు కావాలని ఆకాంక్షించారు. గామీణ ప్రాంతాల్లో ఎక్కువగా వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికులే ఎక్కువనీ, వారిమధ్య ఐక్యత లేకపోతే పోరాటాలను ముందుకు తీసుకుపోలేమని చెప్పారు.



విపి సానూకు మెమొంటో అందజేస్తున్న హేమలత, తపన్‌సేన్

బిజెపిని ఓడించాలి : విపి సానూ

విధానపరమైన మార్పు కోసం జరుగుతున్న పోరాటాల్లో తామూ పాల్గొంటామని ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షులు వీపీ.సానూ చెప్పారు. ఇప్పుడున్న ప్రమాదకర పరిస్థితుల్లో బిజెపిని ఓడించడం అత్యావశ్యకమని అన్నారు. ఇటలీ తరహాలో ఫాసిస్టు విధానాలను భారతదేశంలో ఆమలు చేసేందుకు మతతత్వ శక్తులు పనిచేస్తున్నాయని చెప్పారు. రంగు, మతం, ప్రాంతం, కులం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి బిజెపి రాజకీయ లబ్ధి పొందుతున్నదని విమర్శించారు. అందులో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చిందన్నారు.

నూతన విద్యావిధానంపై పార్లమెంట్‌లో చర్చకూడా జరగలేదనీ, మరోవైపు దొడ్డిదారిన దాన్ని మోడీ సర్కారు అమలు చేస్తున్నదని విమర్శించారు. లేబర్ కోడ్‌లతో కార్మికవర్గాన్ని, నూతన వ్యవసాయ చట్టాలతో రైతులను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నదని చెప్పారు.

కొనసాగుతున్న చర్చలు

పోరాటాలను ఉధృతం చేస్తామన్న ప్రతినిధులు

శ్యామల్ చక్రవర్తి నగర్ నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

రాబోయే రోజుల్లో పోరాటాలను ఉధృతం చేయడం దారా సిఐటియును మరింత బలోపేతం చేస్తామని ప్రతినిధులు తెలిపారు. సిఐటియు మహాసభలో కార్యదర్శి నివేదికపై శుక్రవారం కూడ చర్చలు కొనసాగాయి. 23 రాష్ట్రాల నుండి హాజరైన ప్రతినిధులు చర్చల ప్రక్రియలో పాల్గొన్నారు. నూతన రంగాల్లో కార్మికులను ఐక్యం చేయాల్సిఉందని పలువురు అభిప్రాయ పడ్డారు. దేశంలో మతత్వశక్తులు అధికారంలో ఉండి కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పోరాటాలతోనే మతత్వాన్ని అడ్డుకోగలం : నర్సింగరావు

బిజెపి దేశంలోని అన్ని ప్రాంతాల్లోకి మతత్వాన్నిజొప్పించే ప్రయత్నం చేస్తోందని, దీన్ని పోరాటాల ద్వారా అడ్డుకోగలమని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు అన్నారు సిఐటియు మహాసభ మూడవ రోజు శుక్రవారం జరిగిన చర్చల్లో ఆయన మాట్లాడుతూ బిజెపి ఏదోఒక రూపంలలో మతత్వాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఇదే రకంగా ప్రయత్నం చేసిందని గుర్తు చేశారు. అయితే విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ ఉద్యమం మొదలయ్యాక బిజెపికి అడ్డుకట్ట పడిందన్నారు. పోరాటాల ద్వారా బిజెపికి అడ్డుకట్టవేయగలమన్నది దీనితో స్పష్టమవుతోందన్నారు. అన్ని ప్రాంతాల్లోనూ ప్రత్యేక ఆర్థిక మండళ్లు పరిశ్రమలు కొత్తగా వస్తున్నాయన్నారు. అక్కడ కార్మికుల సమస్యలపై జోక్యం చేసుకునేందుకు వీల్లేకుండా ప్రభుత్వాలు, పోలీసు యంత్రాంగం ముందుకొస్తోందన్నారు.

నిర్మాణంపై మరింత దృష్టి : ఎ.వి నాగేశ్వరరావు

రాష్ట్రంలో సంఘాన్ని మరింతగా నిర్మించడంపై దృష్టి సారించనున్నట్లు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు చెప్పారు. గత మూడేళ్లకాలంలో అనేక కొత్త సంఘాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. . రాబోయే రోజుల్లో వైద్యం, ఆరోగ్యం, పంచాయతీ, తదితర రంగాలపైనా దృష్టి సారించి సంఘాన్ని నిర్మాణంలో మరింత బలపడే విధంగా కృషి చేస్తామని అన్నారు.

నూతన ఒరవడితో ముందుకు : పాలడుగు భాస్కర్

తెలంగాణలో నూతన ఒరవడితో ముందుకు సాగుతున్నామని ఆ రాష్ట్ర సిఐటియు ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు. పాదయాత్రలు, జీపుజాతాలు కొత్త సంబంధాలను తెచ్చిపెట్టాయన్నారు. 450 గ్రామాల్లో 6500 మంది వ్యవసాయేతర కార్మికుల దగ్గరకు వెళ్లి సర్వే ద్వారా వారి జీవన పరిస్థితులు, ఎదుర్కొంటున్న ఇబ్బందులను సేకరించామన్నారు.

యువతను పక్కదోవ పట్టిస్తున్న బిజెపి : ఏ.ఏ రహీం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం యువతను పక్కదోవ పట్టిస్తోందని డివైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు ఏఏ.రహీం తెలిపారు. సిఐటియు అఖిల భారత మహాసభలో ఆయన మాట్లాడుతూ రెండు కోట్ల ఉద్యోగాల హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. యువత సమస్యలపై పోరాటాల్లోకి రాకుండా మతం పేరుతో వారి మెదళ్లల్లో విషం నింపుతున్న దన్నారు. కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానాలతో ముందుకు సాగుతున్న తీరును వివరించారు. యువతను చైతన్యపరిచేలా పోరాటాలను రూపొందిస్తున్నామని చెప్పారు.

'సికింద్రాబాద్' ఘటనలో ముగ్గురు మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్డులోని దక్కన్ స్పోర్ట్స్ నిట్‌వేర్ మాల్‌లో గురువారం జరిగిన అగ్నిప్రమాదం ఘటనలో ముగ్గురు మృతిచెందినట్లు అధికారులు నిర్ధారించారు. మాల్‌లో మంటలు చెలరేగిన సమయంలో అక్కడ చిక్కుకున్న వారిలో నలుగురిని రెస్క్యూ టీం రక్షించగా, బీహార్‌కు చెందిన ముగ్గురు కూలీలు జునైద్, వసీం, జహీర్ ఆచూకీ గురువారం రాత్రి వరకూ తెలియలేదు. శుక్రవారం మరోసారి అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, డిఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఉదయం 10గంటలకు మంటలు పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చాయి. ఆచూకీ తెలియని ముగ్గురకూలీల సెల్‌ఫోన్ సిగ్నల్స్‌ను పోలీసులు ట్రేస్ చేయగా..వాటి లొకేషన్ ప్రమాదం జరిగిన భవనంలోనే చూపిస్తుండటంతో వారు సజీవ దహనమై ఉంటారని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. మాల్‌లోకి వెళ్లేందుకు రెస్క్యూ టీం ప్రయత్నించినా..మాల్‌లో అత్యధిక వేడి ఉండటంతో వెళ్లడం సాధ్యంకాలేదు. దీంతో లోపలికి డ్రోన్ కెమెరాలను పంపించారు. మాల్ రెండో అంతస్తులో పూర్తిగా కాలిపోయిన స్థితిలో ఉన్న రెండు మృతదేహాలను పోలీసులు గుర్తించారు. మూడో వ్యక్తి కూడా మంటలకు ఆహుతై ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. భవనంలో సాధారణ పరిస్థితి వచ్చిన తర్వాతే అన్ని విషయాలు తెలుస్తాయని అధికారులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదం జరగలేదని విద్యుత్ శాఖ డిఇ శ్రీధర్ తెలిపారు. ఒకవేళ షార్ట్ సర్క్యూట్ జరిగి ఉంటే సబ్‌స్టేషన్‌లో ట్రిప్ అయ్యేదని, కానీ అలా జరగలేదన్నారు. టెక్నికల్ టీం తనిఖీ చేసిన తర్వాత వివరాలు వెల్లడిస్తామన్నారు.

ఢిల్లీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌పై దాడి

సిసి టివి ఫుటేజి విడుదల

న్యూఢిల్లీ : ఢిల్లీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ స్వాతి మాలీవాల్‌ను కారుతో ఈడ్చుకెళ్లిన కేసులో సిసిటివి ఫుటేజ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పేవ్‌మెంట్‌పై వేచి ఉన్న స్వాతిని కారులో వచ్చిన వ్యక్తి కారులో ఎక్కమని అడిగాడు. దానికి ఆమె స్పందిస్తూ 'సారీ, మీరు చెప్పింది వినబడ్డం లేదు' అని అన్నారు. దీనికి ఆ డ్రైవర్ తన కారు ఎక్కమని మళ్లీ పట్టుబట్టాడు. దీనికి స్వాతి 'నన్ను ఎక్కడ డ్రాప్ చేస్తారు? నేను ఇంటికి వెళ్లాననుకుంటున్నాను. నా బంధువులు వస్తున్నారు' అని సమాధానం ఇచ్చి పక్కకు వెళ్లిపోయారు. ఈ తరువాత కారు వెళ్లి పోయింది. కారు కొంత దూరం వెళ్లి యూటర్న్ తీసుకుని మళ్లీ స్వాతి మాలీవాల్ వద్దకు వచ్చింది. ఈసారి మళ్లీ తన కారు ఎక్కమని ఆ వ్యక్తి అడిగాడు. 'నేను కారు ఎక్కనని చెబుతున్నా, మళ్లీ రెండోసారి వచ్చావు' అని స్వాతి చెప్పడం వీడియోలో వినబడుతోంది. ఆ వ్యక్తి అసభ్యకరంగా సంజ్ఞలు చేయడంతో నిందితుడిని పట్టుకోవడానికి స్వాతి ప్రయత్నించగా, కారు అద్దం పైకి లాగడంతో ఆమె చేయి అందులో చిక్కుకుపోయింది. స్వాతిని సుమారు 15 మీటర్ల దూరం ఈడ్చుకుపోయాడు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ స్వాతి మాలీవాల్ బాధతో అరవడం కూడా వీడియోలో వినిపించింది.

రోజ్‌గార్ మేళా ప్రారంభం

న్యూఢిల్లీ : వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో కొత్తగా ఉద్యోగాల్లో చేరిన 71 వేల మంది అపాయింట్‌మెంట్ లెటర్లను అందజేసే రోజ్‌గార్ మేళాలో ప్రధాని నరేంద్రమోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. 10 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని గతేడాది ప్రకటించిన 'రోజ్‌గార్ మేళా'లో భాగంగా శుక్రవారం ఈ వేడుక నిర్వహించారు. ఉద్యోగాల్లో చేరిన అభ్యర్థులకు, వారి కుటుంబాలకు మోడీ అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరో లక్ష ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని మోడీ చెప్పారు.

జైలుకు మయన్మార్ మాజీ అధ్యక్షుడి తరలింపు

నెపిడా : మయన్మార్ మాజీ అధ్యక్షుడు యు విన్ మింట్‌ను ఆ దేశంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న జుంటా గృహ నిర్బంధం నుంచి జైలుకు తరలించింది. నేషనల్ లీగ్ ఫర్ డెమొక్రసీ పార్టీ అధ్యక్షుడైన మింట్‌ను గుర్తు తెలియని ప్రదేశం నుండి బాగో రీజియన్‌లోని టాంగూ జైలుకు తరలించారని తెలిసింది. మయన్మార్ మాజీ నేత ఆంగ్‌సాన్ సూకీని గృహ నిర్బంధం నుంచి ఏకాంతవాసానికి తరలించిన ఏడు నెలల తర్వాత మయన్మార్ జుంటా, ఆమె పార్టీకి చెందిన మింట్‌ను జైలు తరలించింది. 2021 ఫిబ్రవరిలో జుంటా విజయవంతంగా కుట్రను అణిచివేసినప్పటి నుండి అధ్యక్షుడు గృహ నిర్బంధంలో వున్నారు.

గవర్నర్ రవిని రీకాల్ చేయండి

తమిళనాడు రాజ్‌భవన్ వద్ద సిపిఎం పికెటింగ్

చెన్నై : తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవిని రీకాల్ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన రాజ్‌భవన్ పికెటింగ్ శుక్రవారం భారీ ఎత్తున జరిగింది. అసెంబ్లీ ఆమోదించిన అనేక బిల్లులను గవర్నర్ పెండింగ్‌లో ఉంచుతున్నారని, రాష్ట్రం పేరుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారని నేతలు విమర్శించారు. ఈ నేపథ్యంలో గవర్నర్‌ను వెంటనే కేంద్ర ప్రభుత్వం రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కె బాలకృష్ణన్, పొలిట్‌బ్యూరో సభ్యులు జి రామకృష్ణన్, కేంద్ర కమిటీ సభ్యులు పి సంపత్, యు వాసుకి, పి షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్ ఇండియాకు రూ.60 లక్షల జరిమానా

న్యూఢిల్లీ : ప్రయాణికురాలిపై తోటి ప్రయాణికుడు మూత్ర విసర్జనకు సంబంధించిన కేసులో ఎయిర్ ఇండియాకు రూ.30 లక్షల జరిమానాను శుక్రవారం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) విధించింది. ఎయిర్ ఇండియా ఇన్-ఫ్లైయిట్ సర్వీసెస్ డైరెక్టర్‌కు రూ. 3 లక్షల జరిమానా వేసింది. పైలెట్ ఇన్ కమాండ్‌పై మూడు నెలల నిషేధం విధించింది. డిజిసిఎ జరిమానాపై ఎయిర్ ఇండియా స్పందిస్తూ లోపాలను గుర్తించామని, వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొంది. గత ఏడాది నవంబర్ 26న న్యూయార్క్ నుంచి న్యూఢిల్లీ వస్తున్న ఎయిర్ ఇండియా విమానం 102లో శంకర్ మిశ్రా తనపై మూత్ర విసర్జన చేశాడని బాధిత మహిళ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. శంకర్ మిశ్రాను ఈ నెల 4న బెంగళూరులో పోలీసులు అరెస్టు చేశారు. అతనిపై ఎయిర్ ఇండియా నాలుగు నెలల నిషేధం విధించింది.

ఎన్‌ఎల్‌సి ఇండియా సిఎండిగా ప్రసన్న కుమార్

హైదరాబాద్ : ఎన్‌ఎల్‌సి ఇండియా లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి)గా ప్రసన్నకుమార్ మోటుపల్లి బాధ్యతలు స్వీకరించారు. ఇంతక్రితం ఆయన గుజరాత్ స్టేట్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ విద్యా సంస్థ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో గోల్డ్ మెడల్ పొందారు. విద్యుత్తు, బొగ్గు రంగాల్లో ఆయనకు మూడు దశాబ్దాలపైగా విశేష అనుభవం ఉంది. ఎన్‌టిపిసిలో ప్రసన్న కుమార్ తన కేరీర్ ప్రారంభించారు. తమిళనాడులోని నైవేలీలోని కంపెనీ కార్పొరేట్ ఆఫీసులో నూతన బాధ్యతల స్వీకరణ సమయంలో ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఇతర అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

గుజరాత్ అల్లర్లకు మోడీదే బాధ్యత

బిబిసి పునరుద్ఘాటన

లండన్ : 2002లో గుజరాత్ అల్లర్లకు అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న మోడీదే ప్రధాన బాధ్యతంటూ రూపొందించిన డాక్యుమెంటరీ సరైనదేనని, పూర్తిస్థాయిలో పరిశోధించి తయారుచేశామని బిబిసి వార్తా సంస్థ స్పష్టం చేసింది. ఈ డాక్యుమెంటరీలో నిష్పాక్షికత లోపించిందని, కేవలం ప్రచారం కోసం తీసిందని భారత ప్రభుత్వం ఖండించిన మరుసటి రోజు బిబిసి డాక్యుమెంటరీని సమర్థిస్తూ, ప్రకటన విడుదల చేసింది. బిబిసి అనుసరించే అత్యున్నత సంపాదక ప్రమాణాలకు అనుగుణంగా తీవ్రంగా పరిశోధనలు జరిపిన అనంతరమే ఈ డాక్యుమెంటరీని రూపొందించామని బిబిసి ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. పలువురు సాక్షులను, నిపుణులను కలిసి మాట్లాడామని, అనేకమంది అభిప్రాయాలు తెలుసుకున్నామని ఆ ప్రతినిధి పేర్కొన్నారు. బిజెపికి చెందిన వారి అభిప్రాయాలు కూడా ఇందులో వున్నాయన్నారు. ఈ డాక్యుమెంటరీలో ప్రస్తావించిన అంశాలకు తాము సమాధానం ఇచ్చే హక్కును కూడా భారత ప్రభుత్వానికి ఇచ్చామని, కానీ స్పందించడానికి వారు తిరస్కరించారని ఆ ప్రతినిధి తెలిపారు. భారతదేశంలో మెజారిటీ హిందువులకు, ముస్లిం మైనారిటీలకు మధ్య గల ఉద్రిక్తతలను ఈ డాక్యుమెంటరీ సిరీస్ పరిశీలించిందని చెప్పారు. ఆ ఉద్రిక్తతలకు సంబంధించి ప్రధాని మోడీ రాజకీయాలను కూడా అన్వేషించామని తెలిపారు.

గుజరాత్ అల్లర్లకు మోడీ ప్రత్యక్షంగా బాధ్యులని బ్రిటన్ విదేశాంగ కార్యాలయ దౌత్యవేత్తలు విశ్వసిస్తున్నారంటూ బిబిసి కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నారా అని ప్రశ్నించగా లేదని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తెలిపారు. ఆ ఘటనల విషయంలో బ్రిటన్ ప్రభుత్వ వైఖరి చాలా స్పష్టంగా వుందని, ఇది శాశ్వతమైనదని, మారబోదని పేర్కొన్నారు.

చార్జిషీట్‌ను బహిరంగపరచలేం

పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం

న్యూఢిల్లీ : పోలీసులు, దర్యాప్తు సంస్థలు దాఖలు చేసే ఛార్జిషీట్‌లన్నీ పబ్లిక్ డాక్యుమెంట్‌లని, వాటిని ప్రచురించాలని లేదా ప్రజలకు బహిరంగపరిచేలా అప్‌లోడ్ చేయాలని కోరుతున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. చార్జిషీట్ అనేది పబ్లిక్ డాక్యుమెంట్ కాదని జస్టిస్ ఎం.ఆర్.షా నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. దీన్ని ప్రజలకు బహిరంగపరిచేలా అందుబాటులో వుంచలేమని తెలిపింది. ఇండిపెండెంట్ జర్నలిస్ట్ సౌరవ్ దాస్ తరపున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తన వాదనలు వినిపించారు. పారదర్శకత వుండాలంటే, చార్జిషీటల్‌ను వారి వెబ్‌సైట్‌లలో అందుబాటులో వుంచడం తప్పనిసరి. అప్పుడు ప్రజలకు మొత్తంగా విషయాలన్నీ తెలుస్తాయని, క్రిమినల్ విచారణలపై విశ్వసనీయమైన, కచ్చితమైన నివేదికను మీడియా ఇవ్వడానికి కుదురుతుందని ఆ పిటిషన్ పేర్కొంది. 2022 జులైలో ఇచ్చిన తీర్పులో ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్ (ఇసిఐఆర్) ను చూపించలేదని, లేదా నిందితుడికి కనీసం ఆ డాక్యుమెంట్ కాపీని కూడా ఇవ్వలేదని ఇది రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడమేనని కోర్టు పేర్కొంది. ఇసిఐఆర్ అనేది అంతర్గత, శాఖాపరమైన పత్రమని కోర్టు సమర్థించింది.

పిటి ఉషకు రెజ్లర్ల లేఖ

ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జంతర్ మంతర్ వద్ద రెజ్లర్లు చేస్తున్న ఆందోళన శుక్రవారం నాటికి మూడోరోజుకు చేరింది. మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న బిజెపి ఎంపి, డబ్ల్యుఎఫ్ఐ అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని వీరంతా కోరుతున్నారు. ఈ క్రమంలో రెజ్లర్లు శుక్రవారం ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఎ) అధ్యక్షురాలు పిటి ఉషకు లేఖ రాశారు. బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ చేతిలో తాము ఎదుర్కొన్న లైంగిక వేధింపుల గురించి చాలామంది యువ రెజ్లర్లు తమకు తెలియజేశారని పేర్కొన్నారు. ఈ లేఖపై టోక్యో ఒలింపిక్స్ పతక విజేతలు రవి దహియా, బజరంగ్ పునియా సహా ఐదుగురు రెజ్లర్లు సంతకాలు చేశారు. రియో ఒలింపిక్స్ కాంస్య విజేత సాక్షి మాలిక్, ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేతలు వినేష్ ఫోగట్, దీపక్ పునియాలు కూడా సంతకం చేశారు. అలాగే విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని, డబ్ల్యుఎఫ్‌ఐని రద్దు చేసి ప్రస్తుతం ఉన్న అధ్యక్షుడిని తొలగించాలన్న తమ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. జాతీయ సమాఖ్య వ్యవహారాలను నిర్వహించడానికి రెజ్లర్లతో సంప్రదించి కొత్త కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. శుక్రవారం ఆందోళనలో వినేశ్ ఫొగాట్, బజరంగ్ పునియా, సాక్షి మాలిక్‌తోపాటు సంగీత ఫొగాట్, బాక్సర్ విజేందర్ సింగ్, బాక్సర్ అమిత్ పంఘల్ తదితరులు పాల్గొన్నారు. సిబిఐ విచారణ జరిపించాలని విజేందర్‌సింగ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి గుత్తా జ్వాల డిమాండ్ చేశారు. రెజ్లర్లు 72 గంటల సమ్మె చేసినా డబ్ల్యుఎఫ్ఐ చీఫ్‌ను ఎందుకు తొలగించలేదని, లైంగిక వేధింపులపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదని డిసిడబ్ల్యు చీఫ్ స్వాతి మాలీవాల్ ప్రశ్నించారు. ఐఓఎ అధ్యక్షురాలు పిటి ఉష ఈ వ్యవహారంపై స్పందించారు. ఈ అంశం తనకు బాధ కలిగించిందని, లేఖ అందిందని, విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని ఉష తెలిపారు. దీనిపై ఐఓఎ అత్యవసర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం జరిగింది.

ఏడుగురు సభ్యులతో కమిటీ

బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణలపై విచారణకు ఐఓఎ ఏడుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ సభ్యులుగా మేరీ కోమ్, డోలా బెనర్జీ, అలకనంద అశోక్, యోగేశ్వర్ దత్, సహదేవ్ యాదవ్, ఇద్దరు అడ్వకేట్లు ఉన్నారు. గోండాలో నిర్వహించే ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సిన రెజ్లర్లకు ఈవెంట్‌ను రద్దు చేసినట్లు చెప్పడంతో నిరసన తెలిపారు. వారికి మద్దతుగా గోండాలో క్రీడాకారులు రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌ను బహిష్కరించారు. ఢిల్లీలో నిరసనకు మద్దతుగా గోండాలో నేషనల్ ఓపెన్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌ను అరడజనుకు పైగా క్రీడాకారులు బహిష్కరించారు

అనురాగ్ సింగ్ ఠాకూర్ తో మరో దఫా చర్చలు

కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్‌తో రెజ్లర్లు మరో దఫా చర్చలు జరిపారు. మంత్రి నివాసంలో జరిగిన చర్చల్లో ఒలింపిక్ పతక విజేతలు బజరంగ్ పునియా, రవి దహియా, సాక్షి మాలిక్, ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతక విజేత వినేష్ ఫోగట్ తో పాటు స్పోర్ట్స్ డిజి సాయి సందీప్ ప్రధాన్ పాల్గొన్నారు.

డబ్ల్యుఎఫ్ఐ చీఫ్‌ను బహిష్కరించే అవకాశం లేదు: ప్రభుత్వం

డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను సస్పెండ్ చేసే అధికారం తమకు లేదని ప్రభుత్వం పేర్కొంది. ఆటగాళ్లు కోరుకుంటే, విచారణ నివేదిక వెలువడేవరకు డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ పదవికి దూరంగా ఉంచవచ్చని తెలిపింది.

పెరూలో కొనసాగుతున్న నిరసనలు

ఒకరి మృతి, పదిమందికి గాయాలు



లిమా : దక్షిణ పెరూ నగరమైన అరెక్విపాలో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు, ప్రదర్శనల నేపథ్యంలో తలెత్తిన ఘర్షణల్లో ఒకరు మరణించగా, పదిమంది గాయపడ్డారని అంబుడ్స్‌మన్ కార్యాలయం ట్విట్టర్‌లో తెలిపింది. "నగరంలో ఉత్తర ప్రాంతంలో వున్న అనషయాకో వంతెనపై జరిగిన ఘర్షణల్లో ఒకరు మరణించడం పట్ల మేం తీవ్రంగా ఆందోళన చెందుతున్నాం. ఇందుకు బాధ్యులెవరో నిర్ధారించేందుకు వాస్తవాలపై సక్రమ దర్యాప్తు చేపట్టాల్సిందిగా పెరూ ప్రాసిక్యూటర్ కార్యాలయాన్ని మేం కోరుతున్నాం." అని ఆ పోస్టు తెలిపింది. గాయపడిన 10మందినీ వెంటనే ఆరోగ్య కేంద్రాలకు తీసుకెళ్లి చికిత్సనందించినట్లు తెలిపింది. పెరూలో దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడంతో, పలు నగరాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. దేశ రాజధాని లిమాలో ప్రస్తుత అధ్యక్షురాలు దినా బొలూర్టె రాజీనామా చేయాలని, తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ వేలాదిమంది ప్రజలు నిరసన చేపట్టారు. పలు ప్రాంతాల్లో పోలీసులతో ఘర్షణ పడ్డారు. పెరూ అధ్యక్షుడు పెడ్రో కాస్టిల్లోనూ పదవి నుంచి తొలగించి, అరెస్టు చేయడంతో డిసెంబరు 10 నుంచి పెరూ వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్నాయి. పౌర సంఘాలు, సంస్థలు ఈ ఆందోళనలను నిర్వహిస్తున్నాయి. భద్రతా బలగాలతో జరిగిన ఘర్షణల్లో, ప్రజా సమీకరణ సందర్భంగా చోటు చేసుకున్న ట్రాఫిక్ ప్రమాదాలు, రోడ్డు దిగ్బంధనాల్లో బుధవారం మధ్యాహ్నం వరకు మొత్తంగా 50మంది పౌరులు మరణించారని అంబుడ్స్‌మన్ కార్యాలయం తెలిపింది.

జైలులోఉన్న కాశ్మీరీ మానవ హక్కుల కార్యకర్త

ఖుర్రామ్ పర్వేజ్‌కు మార్టిన్ ఎన్నాల్స్ అవార్డ్



న్యూఢిల్లీ : ప్రస్తుతం జైలులో ఉన్న కాశ్మీర్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త ఖుర్రామ్ పర్వేజ్‌కు 2023 మార్టిన్ ఎన్నాల్స్ అవార్డ్ లభించింది. చాద్‌కు చెందిన మానవహక్కుల న్యాయవాది డెల్ఫినే డిజిరైబే, వెనుజులాకు చెందిన మానవ హక్కుల కార్యకర్త ఫెలిసియానో రెయాన్‌లతోపాటు పర్వేజ్ ఈ అవార్డును అందుకోనున్నారు. బ్రిటన్ మానవ హక్కుల కార్యకర్త మార్టిన్ ఎన్నాల్స్ పేరుతో ఈ అవార్డును ఏర్పాటు చేశారు. మానవ హక్కుల కోసం అసమాన పోరాటం చేసిన వారికి ఈ అవార్డును అందజేస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 10 ప్రముఖ మానవ హక్కుల ఎన్‌జిఓలతో కూడిన జ్యూరీ ఈ ఏడాది అవార్డును పై ముగ్గురికి ప్రకటించింది. 'బలవంతపు అదృశ్యాల కారణంగా తమ చిన్నారులను కోల్పోయిన కుటుంబాల గొంతును వినిపించడానికి ఖుర్రమ్ పర్వేజ్ విశేష కృషి చేస్తున్నారు' అని జ్యూరీ ప్రశంసించింది.'ఈ ఏడాది అవార్డుకు ఎంపిక చేసిన ముగ్గురికి ధైర్యం, లక్ష్యం, బాధితుల గొంతును ప్రపంచ వేదికలపై వినిపించాలనే సంకల్పం ఒకే విధంగా ఉన్నాయి' అని జ్యూరీ ఛైర్మన్ హన్స్ థూలెన్ ఒక ప్రకటనలో తెలిపారు. పర్వేజ్ బలవంతపు అదృశ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఆసియా ఫెడరేషన్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా ఉన్నారు.

కులాల వారీ జనగణనపై హైకోర్టుకు వెళ్లండి

పిటిషన్లను తోసిపుచ్చిన సుప్రీం

న్యూఢిల్లీ : బీహార్‌లో కులాలా వారీగా జనాభా లెక్కలను నిర్వహించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించడానికి సుప్రీం శుక్రవారం తిరస్కరించింది. ఈ విషయంలో హైకోర్టును ఆశ్రయించాల్సిందిగా పిటిషనర్లను కోరింది. పిటిషనర్ల తరపు న్యాయవాదులు చెప్పిన కారణాలతో సుప్రీం బెంచ్ సంతృప్తి చెందలేదు. పైగా ఈ పిటిషన్ దాఖలు చేయడం వెనుక గల వారి ఉద్దేశాల పట్ల అనుమానాలు వ్యక్తం చేసింది. ఇదేమైనా ప్రజా ప్రయోజనాల వ్యాజ్యమా? అని జస్టిస్ బి.ఆర్.గవాయ్ ప్రశ్నించారు. పిటిషన్లను హైకోర్టులో దాఖలు చేయాల్సిందిగా పిటిషనర్లను కోర్టు కోరింది. ఇదే రకమైన అంశాలపై మూడు పిటిషన్లు విడివిడిగా సుప్రీంలో దాఖలయ్యాయి. హిందూ సేన జాతీయాధ్యక్షుడు విష్ణు గుప్తా, సామాజిక కార్యకర్త అఖిలేష్ కుమార్, ఏక్ సోచ్ ఏక్ ప్రయాస్ సంస్థ ఈ పిటిషన్లు దాఖలు చేశాయి. సుప్రీం నిర్ణయాన్ని నితీష్ కుమార్, తేజస్వి యాదవ్ స్వాగతించారు.






మీకోసం

బాగా నిల్వ ఉండిపోయిన శనగపిండిని పారేయకుండా దాంతో స్టీలు పాత్రలు, వెండి సామాన్లు తోమితే చక్కగా శుభ్రపడతాయి.

జీవన సౌరభం

జీవితంలో ప్రతి రోజూ క్రితం రోజు కన్నా కాస్తో.. కూస్తో.. ఎక్కువ విషయాలు నేర్చుకుంటుండాలి.

ఉడుత ఉపకారం




ఒక కొలను వద్దకు ఉడుత వచ్చి నీటిని తాగుతోంది. అప్పుడే ఆకాశం నుంచి ఒక డేగ వచ్చి ఒడ్డున ఉన్న చెట్టుపై వాలింది. ఆ ఉడుతతో 'ఓ ఉడుతా! నా కాలికి గాయం అయింది. ఎగరలేకపోతున్నా. ఎవరైనా వైద్యం చేస్తారా?' అని మూలుగుతూ అడిగింది.

డేగను చూసి ఉడత జాలి పడింది. వెంటనే కోతి దగ్గరకు వెళ్లి, వెంట తీసుకొని వచ్చింది. ఆ కోతి కొన్ని వనమూలికలు సేకరించి, నూరి ఆ డేగ కాలి గాయంపై పసరును పిండి కట్టు కట్టింది. దానితో డేగకు గాయం బాధ కొంత తగ్గింది. తాను అడిగిన వెంటనే సాయం చేసిన ఉడతకు కృతజ్ఞతలు చెప్పింది. కొంత సమయం తర్వాత ఆ ఉడుతను రెండు కాళ్లతో పట్టుకుని ఎగిరింది.

అది చూసి ఆ కొలనులోని చేపలు అక్కడ ఉన్న కోతితో 'అయ్యో కోతి బావా, చూశావా! ఉడత సాయం చేస్తే.. తననే తినడానికి తీసుకెళ్లింది డేగ' అంటూ విచారించసాగాయి. అప్పుడు కోతి 'మీరన్నది నిజమే! నేను కూడా ఏమీ ఆలోచించకుండా అది రమ్మనగానే ఇక్కడకు వచ్చి. శత్రువని ఆలోచన చేయకుండా వైద్యం చేశాను. ఇక్కడకు రాకుండా ఉంటే బాగుండేది. ఉడుత ప్రాణాలు దక్కేవి' అని బాధపడసాగింది.

ఇంతలో ఆ డేగ ఉడుతను తిరిగి తీసుకొని వచ్చి ఆ కొలను వద్ద జాగ్రత్తగా దించింది. అప్పుడు ఆ చేపలు 'అయ్యో డేగా! నీవు దాన్ని ఆహారంగా తీసుకొని పోయినావని మేము అనుకున్నామే' అన్నాయి. అప్పుడు ఆ డేగ 'లేదు..లేదు.. ఉపకారం చేసిన ఉడతకు అపకారం తలపెట్టలేను. తనకు ఆకాశంలో ఎగరడం అంటే సరదా అని దాని మాటల ద్వారా గ్రహించాను. అందుకే దాని ముచ్చట తీరుద్దామని తీసుకెళ్లాను' అంది. ఆ మాటలకు జీవులన్నీ నవ్వాయి. అక్కడే ఉన్న కోతికి ధన్యవాదాలు తెలిపి ఆకాశానికి ఎగిరింది డేగ.

- సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
99085 54535



ఖాళీలు పూరించండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటి పక్కనే వాటి పేర్లూ ఉన్నాయి. అయితే, స్పెల్లింగ్‌లో కొన్ని అక్షరాలు లేవు. వాటిని నింపండి.

నేను గీసిన బొమ్మ



- వి. దీపిక,
7 వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
యాదమరి,
చిత్తూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చెదిరిన కలలు.. చితికిన బతుకులు..

మూడు వేల రూపాయల కంటే తక్కువ మొత్తానికి ఆడపిల్లలు అమ్ముడవుతున్న దేశం మనది. పేదరికం, నిరక్షరాస్యతతో కొట్టుమిట్టాడే కుటుంబాల ఆడపిల్లలపై కన్నేసిన మానవ అక్రమ రవాణాదారులు (ట్రాఫికర్లు) చిన్న చిన్న మొత్తాలకే ఆడపిల్లలను కొనడం, అమ్మడం చేస్తుంటారు. అలా ట్రాఫికింగ్‌కు గురై బలవంతంగా వ్యభిచార కూపాలకు నెట్టివేయబడుతున్న వారు కొందరైతే... తమ వయసుకు రెట్టింపు వయసున్న తమ భాష కాని, ప్రాంతం కాని వ్యక్తులతో ఇష్టం లేని పెళ్లిళ్లకు బలై జీవితాంతం శారీరక, మానసిక హింసకు గురవుతున్నవారు మరికొంతమంది.

29 ఏళ్ల నజీమా శ్రీనగర్‌లో ఓ చిన్న ఇంట్లో నివసిస్తోంది. ముగ్గురు పిల్లల తల్లి. ఆమెది ప్రేమ వివాహం కాదు.. అలాగని పెద్దలు కుదిర్చిన పెళ్లీ కాదు.. పశ్చిమ బెంగాల్‌లో ఓ చిన్న కుగ్రామంలో నివసించే నజీమా తండ్రి వ్యవసాయ కూలీ. ఐదుగురు సభ్యులున్న ఆ కుటుంబం రెండు పూటలా తిండి తినడమే అరుదు. అటువంటి పరిస్థితుల్లో తన కుటుంబానికి ఎంతోకొంత సాయంగా ఉండాలని తపన పడే నజీమాకు కలకత్తాలో ఓ స్వచ్ఛంద సంస్థ పేద కుటుంబాల ఆడపిల్లలకు ఉద్యోగాలిస్తోందని తెలుసుకుంది. ఆరు గంటలు ప్రయాణం చేసి అక్కడకు చేరుకుంది. 'నేను అక్కడకు వెళ్లేసరికి మిట్ట మధ్యాహ్నమైంది.


రాధ

అదొక అద్దాల భవంతి. అక్కడ కొంతమంది మగవాళ్లు.. చాలామంది ఆడవాళ్లు.. ఉన్నారు. అమ్మాయిలంతా నా వయసు.. అంతకంటే తక్కువ వయసు వారే ఉన్నారు. ఆశ్చర్యంగా.. అయోమయంగా చూస్తున్న నా దగ్గరకు ఒకతను యాలకుల వాసన గుప్పుమని కొడుతున్న ఓ టీ కప్పు తెచ్చి అందించాడు. అంతటి వాసన గల టీ నేనెప్పుడూ తాగలేదు. ప్రయాణం చేసి వచ్చానేమో ఆ టీ కప్పు తీసుకుని తాగేశాను. ఆ తరువాత ఎక్కువ సేపు నిలబడలేకపోయాను. పడిపోతున్న నన్ను ఇద్దరు వ్యక్తులు ఓ కారులో ఎక్కించడం మాత్రం ఇప్పటికీ గుర్తుంది' అంటూ ఆనాటి జ్ఞాపకాల్ని గుర్తుచేసుకుంటున్నప్పుడు ఆమె కళ్లు జలపాతాలయ్యాయి.

పేదింటి ఆడపిల్లలను ఉద్ధరించే ఏ స్వచ్ఛంద సంస్థ అక్కడ లేదు. పేదరికం, అమాయకత్వం గల ఆడపిల్లలను ఎరవేసి పట్టుకునేందుకు ట్రాఫికర్లు పన్నిన పన్నాగం అది. ఆ వలలో చిక్కుకున్నప్పుడు నజీమా వయసు 19. ఆ ట్రాఫికర్లు ఆమెను రైల్వేస్టేషనుకు తీసుకెళ్లారు. అక్కడ తనకులాగే ఓ నలుగురు మహిళలు వారితో ఓ నలుగురు పురుషులను చూసింది నజీమా. ఏం జరుగుతోందో అర్థం చేసుకునే పరిపక్వత లేని ఆడపిల్లలే వాళ్లంతా. 'తలెత్తి ఒకళ్లనొకళ్లం చూసుకోను కూడా లేదు. 20 గంటలు ప్రయాణం చేసిన తరువాత ఢిల్లీకి చేరుకున్నాం. మళ్లీ ఇంకో రైలెక్కి 13 గంటలు ప్రయాణం చేసి జమ్మూ చేరుకున్నాం. అక్కడ మాతో వచ్చిన ట్రాఫికర్లు ఇద్దరు కాశ్మీరీ వ్యక్తులకు మమ్మల్ని అప్పగించారు. మేమంతా భయంతో వణికిపోయాం. ఆకలి, అలసటతో ఉన్న మమ్మల్ని ఓ కారులో ఎక్కించారు. కొండలు, గుట్టల గుండా మా ప్రయాణం సాగింది. చీకట్లో గరుకైన రోడ్ల వెంబడి నడిపించారు. అలా ఎన్ని గంటలు ప్రయాణం చేశామో తెలియదు. చివరికి నేనెప్పుడూ చూడని విచిత్ర ప్రదేశంలో.. నా భాష కాని ప్రాంతంలో.. వేరే ప్రపంచానికి నేను చేరుకున్నాను' అంటున్న నజీమా 25 వేల రూపాయలకు తన కంటే 20 ఏళ్ల పెద్దవాడైన వ్యక్తికి అమ్మబడింది. అప్పటికే అతనికి పెళ్లయి, పదేళ్ల కొడుకున్నాడు. భార్య చనిపోయి రెండో పెళ్లి కోసం ట్రాపికర్లను సంప్రదించాడు. అక్కడికి చేరిన మహిళలందరిదీ ఒక్కొక్కరిదీ ఒక్కో కథ.


అర్షిదా


నజీమ

'పెళ్లయిన తరువాత నేను రోజూ ఏడుస్తూనే ఉన్నాను. నా భర్త ఏం మాట్లాడుతున్నాడో అర్థమయ్యేది కాదు. నా చుట్టూ నా వారెవరూ లేరు. తిండి తినకుండా పస్తులు పడుకునేదాన్ని. పారిపోవడానికి చాలాసార్లు ప్రయత్నించాను. కానీ వీధి మలుపు కూడా తిరిగేదాన్ని కాదు. ఎటు వెళ్లాలో.. ఏం చేయాలో తెలియక రోజుల తరబడి ఏడుస్తూ కూర్చోనేదాన్ని. నేను ఇప్పుడు భర్తను కోల్పోయాను. ఈ చిన్న ఇల్లే నా భర్త ఆస్తి. నా పుట్టింటి కుటుంబం కంటే ఈ పరిస్థితి మరింత దుర్భరంగా ఉంది. ఈ బతుకు నేను కోరుకున్నది కాదు.. బలవంతంగా సంక్రమించింది' అంటూ గుండెలు బాదుకుంటూ ఏడుస్తున్న నజీమా లాంటి వాళ్లు ఎంతోమంది అక్కడ కనిపిస్తున్నారు. 8 మంది బిడ్డల తల్లి 30 ఏళ్ల సబీనా, 43 ఏళ్ల అర్షిదా తన 13 ఏళ్లప్పుడే ట్రాఫికింగ్ ద్వారా ఇక్కడికి చేరి దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నారు.


జమున

ఇది సినిమా కథ కాదు..


నజీమా పశ్చిమ బెంగాల్ నుండి కాశ్మీర్‌కు తరలించబడితే.. దేశంలోనే అత్యంత పేదలున్న రాష్ట్రంగా ఉన్న బీహార్ నుండి ఢిల్లీకి చేరిన మరో యువతి కథ ఇది. 26 ఏళ్ల రాధకు 9 ఏళ్ల కూతురు ఉంది. రాధ 8వ తరగతి చదివేటప్పుడు ఓ రాత్రి ఐదుగురు అపరిచిత వ్యక్తులు ఆమె ఇంటికి వచ్చారు. వారిలో ఒకతనితో రాధకు పెళ్లి నిశ్చయం చేశారు.

'ఆ రోజు అర్ధరాత్రే నాకు పెళ్లయిపోయింది. ఆ రాత్రే మేము ఢిల్లీ ప్రయాణమయ్యాం. అతడు నన్ను ఓ ఇంట్లో ఉంచాడు. ఆరు నెలలు బాగానే ఉన్నాం. ఆ తరువాత నుంచి పదే పదే నాపై చేయి చేసుకునేవాడు. రోజు రోజుకూ ఆ హింస పెరిగిపోయేది. ఒక రోజు ఆగ్రాలోని ఓ వేశ్యాగృహానికి నన్ను అమ్మేశాడు' అంటున్న రాధ ఆ మురికి కూపం నుండి బయటపడాలని ఎన్నో ప్రయత్నాలు చేసింది. ఓ రోజు అక్కడి నుండి బయటపడి 1200 కిలోమీటర్లు ప్రయాణం చేసి తన సొంతూరు చేరింది. అక్కడికి చేరేసరికి ఆమె రెండు నెలల గర్భవతి. ఇంటికొచ్చిన తరువాత బయటికి పొమ్మని అన్నలు, వదినలు బాగా తిట్టేవారు కొట్టేవారు. ఆ బాధ భరిస్తూనే తనలా తన బిడ్డ బతకకూడదని ఒంటరిగా ఉంటూ కూలీ పనులకు వెళ్లి బిడ్డను చదివించుకుంటోంది. బడికి పోతున్న పిల్లలకు పెళ్లి చేసి పంపించిన ఘటనలు అక్కడ నిత్యం అనేకం కనిపిస్తాయి. అయితే రాధ లాంటి మహిళలు అరుదుగా సొంతూళ్లకు చేరుకుంటారు. మిగిలిన వారి ఆచూకీ తెలుసుకోవాలని వాళ్ల కుటుంబాలకు పట్టదు. బీహార్‌లోని కిశాన్‌గంజ్, అరేరియా, కథిహార్, పూర్ణియా వంటి గ్రామీణ ప్రాంతాల్లో నవ వధువుల ట్రాఫికింగ్ సర్వసాధారణం. శ్యామా, జమునలు కూడా ట్రాఫికింగ్‌కు గురై రాధలాగే సొంతూళ్లకు చేరి జీవచ్ఛవల్లా బతుకుతున్నారు.

పిల్లలతో ఇళ్లకు చేరే దారిలేక ఇతర రాష్ట్రాలకు వలసపోయి బతుకుతెరువు కోసం నానా అగచాట్లు పడే మహిళల్లో చాలామంది ట్రాఫికింగ్‌కు గురైనవారే. ఇంత అన్యాయం జరిగినా న్యాయం కోసం పోరాడే తెగువ, ధైర్యం లేని అమాయక మహిళలు వారు.

విదేశాల్లో కనిపించినంత విస్తృతంగా భారత్‌లో మానవ అక్రమ రవాణా జరగడం లేదని కొంతమంది భ్రమపడుతుంటారు. కానీ ఆ చెర నుండి బయటపడే మార్గం లేక, బయటపడితే ప్రాణాలకు ప్రమాదమన్న భయంతో ఎంతోమంది వెలుగులోకి రావడం లేదు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న ఈ సమస్యపై సమాజం, స్వచ్ఛంద సంస్థలు, పాలకులు తగిన రీతిలో స్పందించాలి. మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాల పనితీరును సమర్థవంతం చేయాలి.


'జైలర్'లో తమన్నా లుక్



సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'జైలర్'. ఈ చిత్రంలో హీరోయిన్ తమన్నా నటిస్తోంది. ఈ నేపథ్యంలో తన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. రజనీకాంత్ కెరీర్‌లో 169వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో మాలీవుడ్ సూపర్‌స్టార్ మోహన్‌లాల్‌తో పాటు హీరో శివ రాజ్‌కుమార్, సునీల్ కీలకపాత్రల్లో కనిపించనున్నారు. ఈ ఏడాది వేసవిలో ఈ సినిమా విడుదల కానుంది.

మనోజ్ కొత్త ప్రాజెక్టు

చాలాకాలం విరామం తీసుకున్న మంచు మనోజ్ తన కొత్త ప్రాజెక్టు గురించి ప్రకటించారు. 'వాట్ ది ఫిష్' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌తో వస్తున్న ఈ సినిమాకు మనం మనం బరంపురం అంటూ క్యాప్షన్ కూడా ఉంది. ఈ చిత్రాన్ని 6 సిక్స్ సినిమాస్ భారీ బడ్జెట్‌తో ప్లాన్ చేస్తుండగా విదేశాల్లో షూటింగ్ చేసుకోనుంది. దీనిపై మరింత సమాచారం రావాల్సి ఉంది.






'రైటర్ పద్మభూషణ్' ట్రైలర్ విడుదల

సుహాస్ నటిస్తున్న 'రైటర్ పద్మభూషణ్' నుంచి తాజాగా ట్రైలర్ విడుదల చేశారు. రైటర్‌గా ఓ బుక్ రాసి దాన్ని పబ్లిష్ చేసే క్రమంలో సుహాస్ చేసిన పద్మభూషణ్ పాత్ర ఎలాంటి కష్టాలు పడుతుంది అనేది ఈ ట్రైలర్‌లో చూపించారు. ఈ చిత్రానికి షణ్ముఖ ప్రశాంత్ దర్శకత్వం వహించారు. చాయ్ బిస్కెట్, లహరి ఫిల్మ్స్ నిర్మాణం వహించాయి. ఈ సినిమా ఫిబ్రవరి 3న రిలీజ్ కాబోతున్నట్టుగా మేకర్స్ ప్రకటించారు.

27న ఓటీటీలోకి '18 పేజెస్'




నిఖిల్ సిద్ధార్థ, అనుపమ పరమేశ్వరన్ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం '18 పేజెస్'. పల్నాటి సూర్యప్రతాప్ డైరెక్ట్ చేసిన ఈ డిసెంబర్ 23న ప్రేక్షకుల ముందుకొచ్చింది. రొమాంటిక్ కామెడీ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రం మ్యూజికల్ హిట్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ సినిమా ఆహాలో స్ట్రీమింగ్ కానుంది. ఈ చిత్రాన్ని అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్ 2-సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై బన్నీవాసు నిర్మించారు. 'సుకుమార్ రైటింగ్స్ అంటేనే ఓ మ్యాజిక్.. ఆ కలం నుంచి వచ్చిన ఒక థ్రిల్లింగ్, టచింగ్ బ్లాక్ బస్టర్ 18 పేజెస్.. చదవడానికి అందుబాటులో.. సారీ జనవరి 27 నుంచి వీక్షించండి' అంటూ ఆహా టీం స్పెషల్ వీడియోను షేర్ చేసింది.

అమెజాన్ ప్రైమ్‌లో 'వారీసు'

తమిళ హీరో విజయ్ తాజా చిత్రం 'వారీసు.' వంశీ పైడిపల్లి రూపొందించిన ఈ చిత్రంలో రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటించింది. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రానికి మంచి స్పందన వచ్చింది. దాంతో ఇప్పుడు అమెజాన్ ప్రైమ్ సంస్థ చిత్రం డిజిటల్ రైట్స్‌ను సొంతం చేసుకుంది. ఫిబ్రవరి 10 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో ఉందుబాటులో ఉండనున్నట్లు సమాచారం.



నాలుగేళ్ల క్రితం చెప్పాల్సింది..



'పరిస్థితులు ఇప్పటికే చేయి దాటిపోయాయి. ఎవరి మాట ఎవరూ వినే పరిస్థితుల్లో లేరు. ఈ సూచన నాలుగేళ్ల క్రితం చేసి ఉంటే బాగుండేది. ఇప్పటికే బాలీవుడ్‌కు జరగాల్సిన నష్టం జరిగిపోయింది' అంటున్నారు దర్శకుడు అనురాగ్. షారుఖ్ ఖాన్, దీపిక పదుకొణే తాజాగా నటించిన 'పఠాన్' సినిమా వివాదం నేపథ్యంలో ఉత్తరప్రదేశ్‌లో 'బాలీవుడ్ బాయ్‌కాట్' హ్యాష్‌ట్యాగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. అయితే.. ఇటీవల సినిమాల విషయంలో అనవసర వివాదాల్లో తల దూర్చవద్దంటూ బిజెపి నేతలు, కార్యకర్తలకు ప్రధాని దిశానిర్దేశం చేశారు. మోడీ వ్యాఖ్యలపై దర్శకుడు అనురాగ్ పైవిధంగా స్పందించారు. ఆయన దర్శకత్వం వహించిన 'ఆల్‌మోస్ట్ ప్యార్ విత్ డీజే మొహబ్బత్' ట్రయిలర్ విడుదల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

సిరీస్‌పై గురి

న్యూజిలాండ్ రెండో వన్డే నేడు



మధ్యాహ్నం 1.30గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

రాయ్‌పూర్: తొలి వన్డేలో గెలిచిన టీమిండియా ఇక సిరీస్‌పై గురిపెట్టింది. న్యూజిలాండ్‌తో శనివారం జరిగే రెండో వన్డేలోనూ గెలిచి సిరీస్‌ను ఇక్కడే చేజిక్కించుకోవాలని టీమిండియా భావిస్తోంది. హైదరాబాద్‌లోని ఉప్పల్ వేదికగా జరిగిన తొలి వన్డేలో టీమిండియా 12పరుగుల తేడాతో గెలిచి ఊపిరి పీల్చుకున్నా.. న్యూజిలాండ్ జట్టు చివరి ఓవర్ వరకు పోరాడి టీమిండియాకు చెమటలు పట్టించింది. 50ఓవర్లలో 349 పరుగులు చేయగా.. ఛేదనలో న్యూజిలాండ్ 337పరుగులు చేసి ఓటమిపాలైంది. చివరి ఓవర్ వరకు ఉత్కంఠగా సాగిన ఈ మ్యాచ్‌లో విజయం ఇరుజట్లను ఊరించింది. దీంతో ఈ మ్యాచ్‌లో గెలుపుకు ఇరుజట్లు మరోసారి హోరాహోరీగా తలపడడం ఖాయం.

భారత జట్టుకు మ్యాచ్ ఫీజులో కోత

ఉప్పల్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో స్లో ఓవర్ రేట్‌కు గాను టీమిండియాకు మ్యాచ్ ఫీజులో కోత పడింది. నిర్ణీత సమయానికి భారత్ 3 ఓవర్లు వెనకబడ్డ నేపథ్యంలో మ్యాచ్ ఫీజులో 60శాతం కోత విధిస్తున్నట్లు ఐసిసి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. స్లో ఓవర్‌రేట్ విషయాన్ని మ్యాచ్ రెఫరీ జవగళ్ శ్రీనాథ్ ఐసిసికి నివేదించగా.. భారత జట్టు మ్యాచ్ ఫీజులో సుమారు రూ.39.6లక్షలు కోత పడనుంది.

జట్లు(అంచనా)..

భారత్: రోహిత్(కెప్టెన్), హార్దిక్(వైస్ కెప్టెన్), శుబ్‌మన్, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), కోహ్లీ, సూర్యకుమార్, హార్దిక్ పాండ్యా, శార్దూల్, చాహల్, షమీ, సిరాజ్/ఉమ్రాన్.

న్యూజిలాండ్: టామ్ లాథమ్(కెప్టెన్, వికెట్ కీపర్), ఫిన్, కాన్వే, నికోల్స్, మిఛెల్, ఫిలిప్స్, బ్రాస్‌వెల్, సాంట్నర్, ఇష్ సోధీ, టక్నెర్, ఫెర్గుసన్.

క్వార్టర్స్‌కు ఆస్ట్రేలియా, బెల్జియం

హాకీ ప్రపంచకప్ లీగ్




భువనేశ్వర్: ఎఫ్ఐహెచ్ హాకీ ప్రపంచకప్ క్వార్టర్‌ఫైనల్లోకి ఆస్ట్రేలియా, బెల్జియం జట్లు ప్రవేశించాయి. శుక్రవారం జరిగిన గ్రూప్-ఏ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు 9-2గోల్స్ తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించగా.. గ్రూప్-బిలో బెల్జియం జట్టు 7-1తో జపాన్‌ను చిత్తుచేసింది. దీంతో ఈ రెండు జట్లు ఆయా గ్రూపుల్లో అగ్రస్థానంలో నిలిచి నేరుగా క్వార్టర్స్‌కు అర్హత సాధించాయి. బెల్జియం ఆటగాడు టామ్ బూన్ ఐదు గోల్స్‌తో సత్తా చాటాడు. గ్రూప్-ఏలో ఫ్రాన్స్-అర్జెంటీనా జట్ల మధ్య జరిగిన చివరి లీగ్ మ్యాచ్ 5-5గోల్స్‌తో డ్రా అయ్యింది. గ్రూప్-బిలో జర్మనీ జట్టు 7-2తో దక్షిణ కొరియాను ఓడించింది. దీంతో ఆ జట్లు ఆయా గ్రూపుల్లో 2, 3 స్థానాల్లో నిలిచి క్రాస్ ఓవర్‌కు చేరాయి. క్వార్టర్స్‌కు బెర్త్‌కు క్రాస్ ఓవర్లో మలేషియాతో స్పెయిన్, జర్మనీతో ఫ్రాన్స్, అర్జెంటీనాతో కొరియా, భారత్‌తో న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి.

సక్కారి, కీస్ ఔట్..

మెద్వదెవ్, నొర్రి, టఫీ కూడా..

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్


సక్కారి
కీస్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ స్లామ్‌లో సంచలనాలు నమోదవుతున్నాయి. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ మూడోరౌండ్ పోటీలో 6వ సీడ్ సక్కారి(గ్రీక్), 10వ సీడ్ కీస్(అమెరికా) పరాజయాల్ని చవిచూశారు. సక్కారి 6-7(3-7), 6-1, 4-6తో జూ(చైనా), కీస్ 6-1, 2-6, 1-6తో 24వ సీడ్ అజరెంకా(రష్యా) చేతిలో ఓడారు. ఇతర పోటీల్లో టాప్‌సీడ్ స్వైటెక్ (పోలండ్) 6-0, 6-1తో బస్కా(స్పెయిన్)పై, 17వ సీడ్ ఒస్టాపెంకో(లాత్వియా) 6-3, 6-0తో కోజియోవా(ఉక్రెయిన్)పై, అమెరికాకు చెందిన 7వ సీడ్ కోకా గాఫ్ 6-3, 6-2తో పెరాపై, 3వ సీడ్ పెగూలా 6-0, 6-2తో కోస్ట్యుయుక్(ఉక్రెయిన్)పై గెలిచి నాల్గోరౌండ్‌లోకి దూసుకెళ్లారు.

పురుషుల సింగిల్స్‌లోనూ సంచలనాలు..

పురుషుల సింగిల్స్ మూడోరౌండ్‌లో 7వ సీడ్ మెద్వదెవ్, 16వ సీడ్ టఫీ, 20వ సీడ్ షపొవాలెవ్, 11వ సీడ్ నొర్రి పరాజయాల్ని చవిచూశారు. మెద్వదెవ్ 6-7(7-9), 3-6, 6-7(4-7)తో 29వ సీడ్ కొర్డా(అమెరికా) చేతిలో, టఫీ 3-6, 4-6, 6-3, 6-7(8-11)తో ఖచనోవ్(రష్యా) చేతిలో ఓడారు. మరో పోటీలో 10వ సీడ్ హుర్క్రరాజ్(పోలండ్) 7-6(7-3), 6-4, 1-6, 4-6, 6-3తో షపొవాలెవ్(కెనడా)పై, అన్‌సీడెడ్ లెహెక్రా(చెక్) 6-7(5-10), 6-3, 3-6, 6-1, 6-4తో నొర్రీ(బ్రిటన్)పై గెలిచారు. ఇతర పోటీల్లో 6వ సీడ్ అగర్(కెనడా), 31వ సీడ్ నిషియోకో (జపాన్) మూడోరౌండ్ పోటీల్లో గెలుపొందగా.. 3వ సీడ్ సిట్సిపాస్(గ్రీక్) 6-2, 7-6(7-5), 6-3తో గ్రిస్పీర్(నెదర్లాండ్స్)పై గెలిచారు.



ఆంధ్ర గెలుపు

సౌరాష్ట్రపై 150పరుగుల తేడాతో విజయం

రాయ్‌పూర్: రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-బిలో ఆంధ్రప్రదేశ్ సంచలనం నమోదు చేసింది. ఈ గ్రూప్‌లో ఓటమి ఎరుగని సౌరాష్ట్ర జట్టును 150పరుగుల తేడాతో ఓడించింది. ఆంధ్ర నిర్దేశించిన 343పరుగుల ఛేదనలో భాగంగా ఓవర్ నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 10పరుగులతో శుక్రవారం నాల్గోరోజు ఆటను కొనసాగించిన సౌరాష్ట్ర జట్టు 192పరుగులకే ఆలౌటైంది. పుజారా(91) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించాడు. ఆంధ్ర బౌలర్లలో లలిత్ మోహన్‌కు ఆరు, షోయబ్‌కు మూడు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ లలిత్ మోహన్‌కు లభించింది.

42ఏళ్ల తర్వాత ముంబయిపై ఢిల్లీ గెలుపు

న్యూఢిల్లీలోని ఫిరోజ్‌షా కోట్లా మైదానంలో జరిగిన రంజీట్రోఫీ మ్యాచ్‌లో ఢిల్లీ జట్టు ముంబయిను ఓడించింది. ముంబయి నిర్దేశించిన 95పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ జట్టు కేవలం 2 వికెట్లు కోల్పోయి ఛేదించి 42ఏళ్ల తర్వాత విజయాన్ని సొంతం చేసుకుంది. ఓపెనర్ విజయ్ శర్మ(36), హతిక్ షోకీన్(36) బ్యాటింగ్‌లో రాణించారు. అంతకుముందు ఢిల్లీ జట్టు 1979-80 ఒకసారి ముంబయిని ఓడించింది. 88ఏళ్ల రంజీ ట్రోఫీ చరిత్రలో ముంబయి, ఢిల్లీ చేతిలో ఓడిపోవడం ఇది రెండోసారి మాత్రమే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68